## జూలై 10 మౌన వార్షికోత్సవం

జూలై 10 మెహెర్‌బాబా మౌనవార్షికోత్సవ సందర్భంగా మెహెరాబాద్‌లోని ఆంధ్రా రెస్టుహౌస్‌లో వసతి కోరుకునే జీవిత సభ్యులు జూన్ 28 లోగా తమ వివరాలు ముందుగా పంపుకుని భోజన, వసతి కోసం తగిన రిజర్వేషన్ ఏర్పాట్లు చేసుకోవల్సిందిగా శ్రీ వై.యస్.ఎస్. రావు ఒక ప్రకటనలో తెలిపారు.

## మెహెరస్థాన్‌లో మౌనవార్షికోత్సవం

మెహెరుడి 85వ మౌన వార్షికోత్సవ సందర్భంగా మెహెరస్థాన్, కొవ్వూరులో బాబా ప్రేమికుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేసినట్లు శ్రీ వై.ఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ధర్మశాలలో భోజన వసతి సౌకర్యాలు జూలై 9 నుండి 11వ తేదీదాకా చేసినట్లు ఆయన తెలిపారు. మెహెరస్థాన్‌కు విచ్చేయు బాబా ప్రేమికులు తమ వివరాలు ముందుగా పంపవల్సిందిగా ఆయన కోరారు. ధర్మశాల ఫోన్–08813–234312

## శ్రీమతి యల్లా ప్రగడ మిత్రవింద

శ్రీమతి వై.మిత్రవింద, **అమ్మమ్మ గారుగా** బాబా ప్రేమికుందరికీ చిరపరిచితురాలు. నిత్యం బాబా నామస్మరణలో గడుపుతున్న అమ్మమ్మ గారు 94 సంవత్సరాల వయస్సులో సునాయాసంగా 2010 జూన్ 4న ఉదయం 8.30 నిముషాలకు బాబా నామస్మరణతో రాజమండ్రిలో తుదిశ్వాస విడిచారు. తన దరిచేరిన వారిని ప్రేమగా పలకరించే ఆమె, బాబా ప్రేమికులు ఎమ్.వి.ఆర్.కె.బాలాజీ గారి అమ్మమ్మ. వారి అమ్మకు అమ్మ. బాబాను చేరిన ఆమె గురించి కోఠి సెంటర్‌లో రెండు క్షణాలు మౌనం పాటించారు.

## రాజమండ్రి

శ్రీ తొంటెపు గౌరీశంకరరావు. (45) 7.05.10 శుక్రవారం నాడు, అలాగే, శ్రీ ఎస్.శ్రీరామమూర్తి (82) 2.06.10 బుధవారం నాడు బాబా నామ స్మరణతో తుది శ్వాస విడిచారు. వీరి ఆత్మలకు శాంతి కలగాలని మౌనం పాటించడమైందని శ్రీ విన్నకోట సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D.Nirmaladevi**

RNI No. APTEL/2002/7310 Postal Concession: R&D/ RNP/789/2009-11, Dt.07-01-2009

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :10 సంచిక: 02 హైదరాబాద్ 2010 జూన్ పేజీలు: 40

**Please visit : www.srimeherbaba.com** వార్షిక సభ్యత్వం : రూ.100/-



**Meher Baba's Silence Day July 10**

## జూన్ 27 జూబ్లిలో 'చర్చా గోష్ఠి'

మెహెర్‌బాబా ప్రవచనాలు **సంస్కారాలు - అవగాహన అనే** అంశంపై కంప్యూటర్ ద్వారా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ **చర్చా గోష్ఠి - 2010 జూన్ 27, ఆదివారం, ఉదయం 9.30 నుండి 4.30** దాకా ఏర్పాటు చేసినట్లు కార్యనిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవతారకాలంలో సంస్కారాలు గురించి మెహెర్‌బాబా ఎంతో వివరంగా తన ప్రవచనాలలో వివరించారు. కాగా, ఈ అంశంపై ప్రత్యేకంగా విశేష కృషి చేసిన శ్రీ రాజేంద్ర మెహెర్, హైదరాబాద్, ఈ చర్చా గోష్ఠిలో సంస్కారాలు గురించి సాధికారంగా వివరించనున్నారు. ఆ దరిమలా ఆహుతుల ప్రశ్నలకు ఆయన తగిన సమాధానాలు ఇస్తారు. అవకాశం ఉన్నవారు తప్పక ఈ కార్యక్రమానికి హాజరుకావల్సిందిగా నిర్వాహకులు కోరారు.

# మెహెరస్థాన్ ధర్మశాల, కొవ్వూరు

మెహెర్‌స్థాన్ ధర్మశాల, కొవ్వూరు వార్షికోత్సవం సందర్భంగా ఆగస్టు ఒకటో తేదీన (ఆదివారం) ఉదయం 7.30 నుండి సా॥ 5.30 వరకూ ప్రేమికుల ప్రత్యేక సహవాస్ మెహెర్‌స్థాన్ కొవ్వూరులో ఏర్పాటు చేసినట్లు శ్రీ వై.ఎస్.రావ్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ కార్యక్రమంలో శ్రీ మెహెర్‌నాథ్ కల్చూరీ , శ్రీమతి షీలా డేవిడ్ ఫెన్‌స్టర్, శ్రీ రమేష్ జంగ్లే (మెహెరాబాద్), శ్రీ యం.బి.ఖండాలే (మెహెరాబాద్), శ్రీ ప్రభు పోఫలీ, కళ్యాణ్, (మహారాష్ట్ర), శ్రీ ఉజ్జంకర్ గురూజీ, (ఆర్వీ) మహారాష్ట్ర., శ్రీ జిల్-పిల్-వార్ మాధవరావు (మెహెర్‌బాద్), శ్రీ మానిక్ ఉబాలే (నాగపూర్), శ్రీ కె.హెచ్.కె. ప్రసాద్/ శ్రీమతి కె.శారద (హైదరాబాద్) తదితరులు పాల్గొంటారని తెలిపారు. శ్రీ బి.రామక్రిష్ణయ్య, కార్యక్రమ నిర్వహణ చేపడతారని అన్నారు.

# హెల్ప్‌లైన్

మీరు ఎటువంటి ఫిర్యాదులనైనా అందించాలంటే **శ్రీ యన్. మహేశ్వర్‌రావు -040-27964050, 9441218841,** శ్రీ కె.యస్. ఓం ప్రకాశ్- **94403-65640,** హైదరాబాద్‌లను సంప్రదించగలరు.

## విజ్ఞప్తి

మెహెర్‌బాబా పత్రికకు వార్షిక చందా రూ. 100/- లేదా జీవిత సభ్యత్వం రూ. 1000/- చెల్లించండి. పత్రిక పురోభివృద్ధికి సహకరించండి. మా అడ్రస్సు ఎడిటర్, మెహెర్‌బాబా, గోదావరి గార్డెన్స్, యాప్రాల్, ప్లాట్ నెం.32, జె.జె. నగర్‌కాలనీ , సికింద్రాబాద్-500 087 ఫోన్: 99595-53218





## బాబా సందేశం

**Desireless causes a man to be unmoved by pleasure and sorrow; he is not upset by opposites.**

**కోరికలు లేకుండా ఉండగల్గాలి. కోరికలు వల్లనే సుఖ సంతోషాలు, కష్ట-నష్టాలనే బాధలు తలెత్తుతున్నాయి.**

**కోరికలు లేని వానికి ఆనందం- దుఖం రెండూ సమానమే.**

**- మెహెర్‌బాబా**

గౌరవ సంపాదకులు
**మల్లాది కృష్ణానంద్**
**99595-53218,**
**krishnanandm@yahoo.com**

*వ్యవస్థాపకులు:*
**దశిక ప్రసాదరావు**
040-65699611
040-64542370

**ఉత్తర ప్రత్యుత్తరాలకు**
ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం.32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218

## లోపలి పేజీలలో...

1. సంపాదకీయం 5
2. ఉపాసనీ మహారాజ్‌తో భేటి 6-9
3. బాబా మౌనం- బాబా ప్రేమికుల అభిప్రాయాలు 10-17
4. మండలి సభ్యుడు- విష్ణు 18-19
5 లార్డ్‌మెహెర్ 20-26
6. న మే భక్తః ప్రణశ్యతి 27-29
7. మా మాటలు 30-35
8. బాటసారులు 36-37
9. జీవిత సభ్యులు 38

### మనవి

మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. మీకు 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.

Please visit : www.srimeherbaba.com

# భావూజీ ఆరోగ్యం

ఇటీవల – అమెరికా వెళ్ళిన బాబా ట్రస్టు ఛైర్మన్ భావూజీ, మే 24న స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. అమెరికాలోని మెహెరానా బాబా సెంటర్‌లో వుంటుండగా మే 24 కడుపులో నొప్పిలా రావడంతో ఆయన్ని స్థానిక ఆసుపత్రిలో చేర్పించారు.

అన్ని చికిత్సలు– పరీక్షలు చేసిన తర్వాత మే 31న శ్రీ భావూజీని ఆసుపత్రినుంచి డిశ్చార్జి చేసి మెహెరానా సెంటర్ (కాలిఫోర్నియా) తీసుకు వచ్చారు.

భావూజీ ఆరోగ్యంగా క్షేమంగా వున్నారని, అయితే, చాలా నీరసంగా వుండటంతో బాబా ప్రేమికులు విరివిగా ఫోన్ కాల్స్, ఇ–మెయిల్సు ఇవ్వొద్దని ఆయన సమీపంలో వున్న బాబా ప్రేమికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఆంధ్రా రెస్ట్‌హౌస్

ఈ వేసవిలో (2010 మార్చి 16 నుండి) సుమారు వెయ్యి మందికిపైగా బాబా ప్రేమికులు ఆంధ్రారెస్ట్‌హౌస్ ఆతిథ్యం స్వీకరించారు. తెలుగు వారితోపాటు పలు ప్రాంతాలవారు అతిథిగృహ సేవలు వినియోగించుకున్నారని కార్యదర్శి వై.ఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. అతిథి గృహానికి నిరంతరం నీళ్ళు–విద్యుత్ సరఫరా– ట్రస్టు వారి సౌజన్యంతో లభిస్తున్నాయని, బాబా ప్రేమికులకు చక్కని ఆవాసం ఆంధ్రా రెస్ట్‌హౌస్ కల్పిస్తోందని పలువురు ప్రేమికులు పేర్కొన్నారు. దినారాత్రులలో ఏవేళప్పుడయినా ఇక్కడ బాబా ప్రేమికులకు వసతి భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. రోజులో 24x7, ఏడాది పొడుగూతా బాబా ప్రేమికులకు అతిథిగృహం సాదర ఆహ్వానం పలుకుతోందని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు శ్రీ వై.యస్.రావు, కార్యదర్శి, ఆంధ్రా రెస్టుహౌస్, బి.ఎస్.ఎన్.ఎల్. టవర్ ఎదురుగా, మెహెరాబాద్ – 414006 మహారాష్ట్ర, అహ్మద్‌నగర్ జిల్లా, ఫోన్–0241–2548544/ 2548017 మొబైల్–09011751910, 9848111671 సంప్రదించగలరు.

### ఆంధ్రా రెస్ట్‌హౌస్‌కు ఆన్‌లైన్ విరాళాలు పంగోరువారికి వివరాలు

State Bank of India, VRDI Branch, IFS No. SB IN 0010712, SB A/c No.31057241962

ఆంధ్రా రెస్ట్‌హౌస్– బాబా ప్రేమికులు అందరికీ చెందినది. ఈ భవన అభివృద్ధికి మెహెరాబాద్‌కు విచ్చేసే బాబా ప్రేమికులందరికీ సహాయపడేలా–మరింత శోభాయమానంగా తీర్చిదిద్దేందుకు ప్రతి బాబా ప్రేమికుడు దయచేసి వారి శక్త్యానుసారం ఆర్థికంగా విరాళాలు పంపి సహకరించవల్సింది. భవదీయ– వై.ఎస్.రావ్, కార్యదర్శి.





సంపాదకీయం

# సందేహాలు

మెహెర్‌బాబా 1953 జనవరి, 1954 ఫిబ్రవరి నెలలలో రెండుసార్లు బాబా తెలుగునాట పలు ప్రాంతాల్లో పర్యటించారు. విజయవాడ, మచిలీపట్నం, రాజమండ్రి, గుంటూరు తదితర అనేక ప్రాంతాల్లో బాబా ప్రజా దర్శనాలు ఇచ్చారు. స్థానిక ప్రజానీకం తండోపతండాలుగా విచ్చేశారు. ఆ జనసందోహంలో మేధావులయిన పలువురికి సహజంగానే పలు అనుమానాలు ఉండవచ్చు. బాబాను అడిగి వారి అనుమానాలు, సందేహాలు నివృత్తి చేసుకోవాలనుకున్నారు. మరికొందరికి తమ కష్టాలు చెప్పుకోవాలని వుంది. ఐతే, సమయం తక్కువగా వుంది కాబట్టి బాబా ఏమన్నారంటే.... మీ సందేహాలు లేదా మీరు అడగదలుచుకున్న విషయాలన్నింటినీ ఓ కాగితంపై రాసి ఇవ్వండి. అలాగే మీ పోస్టల్ చిరునామా కూడా రాయండి. నేను మెహెరాబాద్‌కు తిరిగి వెళ్ళాక ప్రతి ఒక్కరికి సమాధానం రాసి మీ అడ్రస్సులకు పంపుతానన్నారు. స్థానికులు ఇచ్చే కాగితాలు స్వీకరించే బాధ్యత బాబా ఆంధ్రా పర్యటనలో పాల్గొనడానికై హమీపూర్ నుంచి ప్రత్యేకంగా వచ్చిన బాబా ప్రేమికుడు శ్రీ పుకార్‌కి అప్పగించారు. పుకార్‌జీ బాబా ఆదేశానుసారం స్థానిక ప్రజలు ఇస్తున్న కాగితాలు తీసుకున్నారు. ఆంధ్రాలో బాబా పర్యటన అయిపోయి అందరూ మెహెరాబాద్‌కు చేరుకున్నారు. ఆ దరిమలా బాబా పుకార్‌జీని పిలిచి, ఏవీ ఆంధ్రాలో అక్కడివారు నీకిచ్చిన కాగితాలు. మరి వాటికి మనం జవాబులు పంపాలి కదా అన్నారు. పుకార్‌జీ ఏమన్నారంటే... బాబా.... ఆంధ్రాలో అనేకమంది నా చేతికి అనేక వందల వేల సంఖ్యల్లో వారి సమస్యలూ ఇతరత్రా రాసిన చీటీలు ఇచ్చారు. అయితే, వారిలో కొందరు బాబా దర్శనం అయినాక తమ ప్రశ్నలకు జవాబులు దొరికిందనిచెప్పి వారు నా చేతికిచ్చిన కాగితాలు వాపసు అడిగి తీసికెళ్ళి పోయారు. కొందరు కొన్ని గంటల్లోనే వారిచ్చిన కాగితాలు వాపసు తీసుకున్నారు. మరికొందరు ఆ మర్నాడు తీసుకున్నారు. ఆ మాదిరిగా, ఆంధ్రాలో బాబా పర్యటన ముగిసేనాటికి నా చేతికిచ్చిన కాగితాలను ఆయా వ్యక్తులు తిరిగి తీసికెళ్ళిపోయారు. ప్రస్తుతం నా దగ్గర ఒక్క కాగితం కూడా లేదు అని బాబాతో వినయంగా చెప్పాడు. ఓహో..అలాగా.. అని ఏమీ ఎరుగనట్లు తన కేసి క్రీగంట చూశారని పుకార్‌జీ తన జ్ఞాపకాల దొంతర్లను ఓ సందర్భంలో చెప్పారు. మెహెర్‌బాబా మౌనావతారుడు. మౌనంగానే తన ప్రేమికులందరితో నేరుగా మాట్లాడతాడు. **నేను ఎలాంటి మహత్యాలు చేయనని పదేపదే ప్రకటించిన మెహెర్‌బాబా, తన ప్రేమికుల అనంతమైన కోరికల చిట్టాను కాదు కానీ, వారి తక్షణావసరాలను తప్పక ఆదుకుంటానన్నారు.** దయగల తండ్రి మెహెర్‌బాబా.

## మౌన వార్షిక ప్రత్యేకం

## మెహెర్‌బాబా మౌనం

# ఉపాసనీ మహరాజ్‌తో భేటి



మెహెర్‌బాబా 1925 జూలై 10వ తేదీ నుండి మౌనం పాటించారు. అప్పటికి ఆయన వయస్సు 30 సంవత్సరాలు.

మెహెర్‌బాబా చక్కగా మాట్లాడేవారు. ఎంతో మధురంగా పాటలు పాడేవారు. ఆయన ఆధ్యాత్మిక విషయాలపై అనర్గళంగా మాట్లాడుతుంటే ఆయన చుట్టూతా వున్నవారు మంత్ర ముగ్ధులయ్యేవారు. మెహెర్‌బాబా మౌనం ప్రారంభించనున్నానని తన దగ్గరున్న భక్తులతో ప్రకటించగానే, బాబా మౌనంగా వుంటారన్న బాధతో నీ సందేశాలు వినే భాగ్యం కల్పించమని, మౌనం చేపట్టవద్దని బాబాని చాలామంది ప్రాధేయపడ్డారు.

మెహెర్‌బాబా వారిని ఓదారుస్తూ, సమాధాన పరిచేలా "నేను బోధించుటకు రాలేదు మేల్కొల్పుటకై వచ్చానని" "I have not come to Teach but to awaken" అని క్లుప్తంగా అన్నారు. అలా మెహెర్‌బాబా చేపట్టిన మౌనం 1969 జనవరి 31న ఆయన భౌతిక దేహం వదిలే వరకూ కొనసాగించారు.

మీ హృదయాంతరాలలో మీకు వినిపించే నా మాటలు ఆలకించండన్నారు. మెహెర్‌బాబాను సాక్షాత్తూ ఈ యుగావతారునిగా ఆరాధించే బాబా భక్తులు,







ప్రేమికులందరూ ఒక్కటే చెప్తారు. మెహెర్‌బాబా మౌనంగా వున్నా, మా సమస్యలు, బాధలు, మంచీ-చెడు, కష్టాలు నష్టాలు, శుభం-అశుభం ఇలా పలు అంశాలగురించి మనస్సులో ఆయన్ని తలచుకున్నంతనే క్షణకాలంలో మనస్సు కుదటనపడేలాగా బాబా సరైన జవాబిస్తారని వారు చెప్తారు. ఇది సాధ్యమా ? గొప్ప బడాయిలే- అనీ అనొచ్చు. కానీ, ఇది నిజం. ఆర్తితో, ఆర్ధ్రతతో, మౌనంగా నిశ్చలంగా మనస్సులోని మాటలను బాబా ఎదుట చెప్పుకుంటే ఉపశమనం కల్గించే ఓదార్పు మాట లభిస్తుందని బాబా ప్రేమికులందరూ పేర్కొంటారు.

బాబా వారి జవాబు చదువుతున్న పుస్తకంలోని ఒక వాక్య రూపంలోనో, మరొకరి ద్వారా ఓ సలహాగానో, ఇలా ఏదొక మాదిరి, క్షణం జాగుచేయక బాబా స్పందిస్తారు. ఇది మా అనుభవం. పలుమార్లు అనుభవించిన అనుభూతి అని బాబా భక్తులు అనేకమంది పేర్కొంటారు. మెహెర్‌బాబా అనుక్షణం మా వెంట వున్నట్లే మా అనుభూతి అని బాబా ప్రేమికులు వెల్లడిస్తారు. బాబా తన భౌతిక దేహత్యాగాన్ని "స్నానం చేశాక మార్చుకున్న 'కోటు' లాంటిదని వర్ణించారు. తాను 700 సంవత్సరాలకు తిరిగి వస్తానని ప్రకటించారు. అప్పటిదాకా తన ప్రేమికులతో మౌనంగానే మాట్లాడతానని, సావధానంగా తన మాటలు ఆలకించడానికి సిద్ధంగా వుండమని పిలుపు ఇచ్చారు. "I am never silent. I speak eternally, The voice that is heard deep within the soul is My voice అని మెహెర్‌బాబా ప్రకటించారు.

మెహెర్‌బాబా తన ప్రేమికులందర్నీ ప్రతి ఏడాది తాను మౌనం ప్రారంభించిన రోజైన జూలై 10 నాడు మౌనంపాటించమని కోరారు. ఆయన ఆదేశాలమేరకు ప్రతి సంవత్సరం జూలై 9 అర్ధరాత్రి 12 గంటల నుండి జూలై 10 అర్ధరాత్రి 12 గంటల దాకా బాబా ప్రేమికులందరూ మౌనం పాటిస్తున్నారు. మనస్సును కట్టడి చేసి బాబా నామం తలుచుకుంటూ ఆ ఒక్క రోజు మౌనంగా వుండమన్నారు.

అవతార్ మెహెర్‌బాబా మౌన వార్షికోత్సవ సందర్భంగా మెహెర్‌బాబా తన గురువుగా కీర్తించిన ఉపాసనీ మహరాజ్‌తో ఆఖరి సమావేశం గురించి శ్రీ యం.ఆర్.ధాకే ఫాల్కర్ రాసిన అరుదైన అంశాలను మెహెర్‌బాబా పాఠకుల కోసం ప్రచురిస్తున్నాం. దయచేసి పరిశీలించండి.

ఈ విషయాలను శ్రీ ధాకేజీ స్వీయరచనలో ప్రచురించిన

In the Company of Avatar Meher Baba అనే గ్రంథంలో పేజి 130 & 131 లలో ఉటంకించారు.

**ఉపాసనీ మహారాజ్‌తో మెహెర్‌బాబా కలిసిన ఈ సమావేశ సందర్భంలో శ్రీ ధాకే ఫాల్కర్ కూడా బాబావారి మండలి సభ్యులతో కలిసి ఉన్నారు. ఆయన స్వయంగా తన కనులారా చూసిన విషయాలను యధాతథంగా గ్రంథస్తం చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇదొక అరుదైన అంశం, మెహెర్‌బాబా పాఠకులకు ప్రత్యేకం.**

**ఇకపై శ్రీ ధాకేజీ మాటల్లో.....**

ఇది ఉపాసనీ మహారాజ్‌ని కడపటి సారిగా, చిట్టచివరిగా మెహెర్‌బాబా కల్సిన సందర్భం.

మహారాజ్ త్వరలో దేహత్యాగం చేయనున్నారని తెలిసి, కడపటి సారిగా మహారాజ్‌తో కల్సి సమావేశమయ్యేందుకు మెహెర్‌బాబా 1941 అక్టోబర్ 17, నాసిక్‌కు దగ్గర్లోని దహీగాం అనే చిన్న గ్రామం వెళ్ళారు.

ఆనాడు మెహెర్‌బాబా మండలివారితో పాటు నేనూ వున్నాను.

మెహెర్‌బాబా, ఉపాసనీ మహారాజ్‌లు ఇద్దరూ ఏకాంతంగా ఓ ప్రత్యేక శిబిరంలో సుమారు 30 నిముషాలు సమావేశమయ్యారు.

ఆ సమయంలో మేమందరం దూరంగా వున్నాం.

అర గంట తర్వాత బాబా బయటకు వచ్చారు.

ఆ సమావేశ వివరాలు వినేందుకు మేమంతా చాలా ఆత్రుతగా వున్నాం.

ఆ శిబిరంలోంచి బయటకొచ్చిన బాబావారి ముఖం ఎంతో తేజోవంతంగా వుంది. అప్పట్లో బాబా అక్షర ఫలకం (Alphabet Board) వాడుతున్నారు.

బాబా ఆ అక్షర ఫలకంపై తమ సమావేశ వివరాలు మాకు క్లుప్తంగా ఇలా చెప్పారు.

'నన్ను చూడగానే ఉపాసనీ మహారాజ్ గాఢంగా ఆలింగనం చేసుకున్నారన్నారు. త్వరలో తాను దేహత్యాగం చేయబోతున్నానని చెప్పారు. తన తదనంతరం, సాకోరి ఆశ్రమ బాధ్యతలు నన్ను తీసుకోవాలిసిందిగా మహారాజ్ కోరారు.

ప్రత్యేక మతాచారాల ప్రకారం నిర్వహిస్తున్న సాకోరీ ఆశ్రమాన్ని నేను చేపట్టలేనని చెప్పాను. ఐతే, సాకోరి ఆశ్రమవాసులైన సతి గోదావరి మాయి, వోఘ్ (Wogh) లకు ఈ బాధ్యత అప్పగించడం సమంజసమని సలహా ఇచ్చాను.

కాగా, సతి గోదావరి మాయి యొక్క ఆధ్యాత్మిక ఉన్నతి సగభాగం తాను పూర్తి చేశాను. మిగిలిన శేషభాగాన్ని నన్ను స్వీకరించమని, ఆమె తన లక్ష్యం చేరుకునేలా సహాయం చేయమని మహారాజ్ నన్ను కోరారు.

అందుకు నేను అంగీకరించాను.

ఆ తర్వాత, నీవు నాతో సాకోరీలో ఉన్నప్పుడు ఎంతో మధురంగా, మృధువుగా





మాట్లాడుతుండేవాడివి.

నీవిప్పుడు మౌనం చేపట్టావు. నీ అందమైన గొంతు విని చాలా కాలమయింది.

నేను నీ గురువుని.

నీ మధురమైన గొంతు వినాలని వుంది.

దయచేసి, మౌనం విడనాడి కొన్ని క్షణాలు నాతో మాట్లాడమని మహారాజ్ నన్ను అడిగారు.

ఆయన నా ప్రథమ గురువు.

ఆయన మాటను విధేయతతో అమలుపరచడం నా కర్తవ్యం, విధి.

మహారాజ్ కోసం నా మౌనాన్ని ఆపి మాట్లాడవల్సింది.

కానీ నేను అలా చేయలేకపోయాను. నా కళ్ళు కన్నీటితో చెమ్మగిల్లాయి.

ఆయన పాదాలకు నమస్కరిస్తూ, నా కన్నీటితో ఆయన పాదాలు స్పృశించాను.

నా గురువు గారి కళ్ళు కూడా కన్నీటితో చిప్పరిల్లాయి.

నా పరిస్థితి చూసి మహారాజ్ అన్నారు కదా–

నీ బాధ్యత గురించి నాకు తెలుసు.

నీవు మౌన విరమణ చేయలేవు. నా కోసం నీవు మౌన విరమణ చేయవద్దు. ఇప్పుడు నాకు నీ గొంతు వినాలని లేదు. ఆ విషయం మరచిపోయి, హాయిగా వుండు అని ఉపాసనీ, నా భుజం తట్టారు.

ఆ తర్వాత ఆయన నాకు గట్టి ఆలింగనం ఇచ్చారు.

నేనూ ఆయన్ని ప్రేమతో కౌగలించుకున్నాను.

ఆ పిదప నా గురువు, "నీవు అవతారుడవు. గుర్తుంచుకో.

"Remember You are AVATAR" అని హెచ్చరించారు.

ఆ తర్వాత మేమిద్దరం ఆ శిబిరం నుండి బయటకు వచ్చాం.

ఆపై నిష్క్రమించాం అని బాబా ఉపాసనీతో తాను జరిపిన ప్రత్యేక సమావేశ వివరాలను మాకు చెప్పారు.

ఆ దరిమలా, కొద్దిరోజులకే ఉపాసనీ మహారాజ్ దేహత్యాగం చేశారు.

## శ్రీ బేతు రామకృష్ణ

శ్రీ బేతు రామకృష్ణ (71) తాడేపల్లిగూడెం 2010 జూన్ 7న బాబా నామస్మరణతో తుదిశ్వాస విడిచారని డా॥ విజయసారధి ఒక ప్రకటనలో తెలిపారు. 10 సంవత్సరాల క్రితం తన వద్దకు ఓ పేషెంటుగా వచ్చి, క్రమేణా అవతారుని సెంటర్ కార్యకర్తగా, స్థానిక బాబా సెంటర్ ఉపాధ్యక్షునిగా విధేయతతో బాబా సేవ చేసిన ధన్యుడు శ్రీ బేతు రామకృష్ణ అని, వారి కుటుంబ సభ్యులకు తమ సంతాపం తెలిపారు.

బాబా ప్రేమికుల అభిప్రాయాలు....

# ఆలోచనలను అడ్డుకోవద్దు

- శ్రీ ఎ.వి.రాఘవులు, విజయవాడ

మెహెర్‌బాబా మౌనావతారుడు.

మౌనంలో మెహెర్‌బాబా 13 సార్లు అనేక ప్రపంచ దేశాలలో పర్యటించారు.

మన దేశంలో అన్ని ప్రాంతాలూ మెహెర్‌బాబా మౌనంలోనే పర్యటించారు.

మన తెలుగు రాష్ట్రంలో బాబా రెండు దఫాలు సందర్శించి ఎందరికో దర్శన, ఆలింగన భాగ్యం కల్పించారు. మౌనంగానే ఎన్నో సందేశాలు, ప్రవచనాలు తన ప్రేమికులకు బాబా అందజేశారు.

మెహెర్‌బాబా భౌతిక దేహ త్యాగం చేశాక అప్పటి బాబా ట్రస్టు చైర్మన్ సో. మణి జె. ఇరానీ ఒక సర్క్యులర్ పంపారు.

దాని సారాంశం ఏమంటే, బాబా మౌనంలోనే తన విశ్వకార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ఈ సృష్టి కర్త.

మెహెర్‌బాబా మౌనం ప్రారంభించిన రోజైన జూలై 10 సందర్భంగా మెహెర్‌బాబా సూచనల మేరకు, బాబా ప్రేమికులందరం జూలై 9 అర్ధరాత్రి 12 గంటల నుండి జూలై 10 అర్ధరాత్రి 12 గంటల దాకా మౌనంగా వుందామని మనవి చేశారు.

మౌనం పాటించే విషయంలో మెహెర్‌బాబా తన ప్రేమికులనుద్దేశించి చాలా స్పష్టంగా ఇలా చెప్పారు.

మీరు మౌనంలో వుండగా మీ మనస్సు పరిపరివిధాల పరిభ్రమిస్తూ వుంటుంది. ఎన్నో ఆలోచనలు వస్తాయి. అలాంటి ఆలోచనలను అడ్డుకోవద్దు. అయ్యో... అని బాధ పడొద్దు. ఆలోచనలను ఫ్రీగా రానీయండి. అలాగే పోనీయండి.

నా నామం తలుచుకోవడం మాత్రం మరిచి పోవద్దు అని బాబా అన్నారు.

అలాగే, మౌనంగా వున్న సమయంలో పొరపాటున మాట్లాడినా, ఫరవాలేదు. అయ్యో... మాట్లాడేశానే! అని భాధపడకుండా, తిరిగి మౌనం కొనసాగించండన్నారు.

"Never try to check the flow of thoughts. Let thoughts come and go as freely as possible. But you try to remember Me constantly and whole heartedly" - Meher Baba.

* * *





ఆ రోజుల్లో నేను కలకత్తాలో వుండే వాడిని. రైల్వే శాఖలో ఉద్యోగం. కలకత్తా బాబా సెంటర్ ద్వారా సుమారు 10-15 మందిమి బాబా సూచనల మేరకు ఆయన్ని పలుమార్లు దర్శించుకునే భాగ్యం మాకు లభించింది.

బాబా వేసవి విడిదిగా పూణేలోని గురుప్రసాద్ బంగళాలో వున్నారు. ఆ సమయంలో ఒక్కోరోజున ఒక్కో సెంటర్‌వారిని బాబా తన దర్శనార్థం రమ్మనమని ఆదేశించేవారు.

ఆ మాదిరిగా జూలై నెలలో ఓ రోజున మా కలకత్తా సెంటర్ వారికి రమ్మనమని ఆహ్వానం వచ్చింది. కలకత్తా సెంటర్ ప్రేమికులుగా మేం ఓ 15 మందిమి పూనేలోని, గురుప్రసాద్‌కు బాబా దర్శనార్థం వెళ్ళాం. బాబావారి దర్శనం చేసుకున్నాం. బాబా మాలోని ప్రతి ఒక్కరి గురించి అడిగారు. చక్కని కార్యక్రమాల్ని తిలకించి, అవతారుని దివ్య తేజోమయ దర్శనం చేసుకున్నామన్న తృప్తితో ఆ సాయంత్రం గురుప్రసాద్ నుండి వెనుదిరిగాం.

గురుప్రసాద్ బంగళా దాటబోతుండగానే బాబావారి మండలి సభ్యుడు సో॥ ఏరుచ్ చప్పట్లు కొడుతూ నన్ను బాబా పిలుస్తారని చెప్పాడు.

దాంతో నేను తిరిగి ఆ బంగళాలో బాబా వుంటున్న మొదటి అంతస్థుకు వెళ్ళాను.

బాబా ఎదుట నిలుచున్నాను.

బాబా నాతో ఏమన్నారో తెలుసాండి !!

రేపటి రోజు ప్రాముఖ్యత, Importance ఏమిటో నీకు తెలుసా? అని నన్ను అడిగారు.

నేను జవాబిచ్చేలోగానే, రేపు నా పుట్టినరోజు కదా ! అన్నారు.

బాబా పుట్టిన రోజు ఫిబ్రవరి 25 కదా.

ఇది జూలై నెల కదా? ఇదేంటి చెప్మా...అని ఆలోచనల్లో నేనుండగా....... బాబానే తిరిగి నాతో అన్నారు.

రేపు నా పుట్టిన రోజు.

రేపు శ్రీకృష్ణాష్టమి.

Birthday of Lord SriKrishna.

I am that Lord SriKrishna అన్నారు.

అంతేకాదు, రేపు కూడా మీరు ఇక్కడే వుండండి.

నా పుట్టినరోజు వేడుకలలో పాల్గొనండని ఓ అరుదైన ఆహ్వానం బాబా మాకిచ్చారు.

సరే- బాబా - అని విధేయతతో బాబాతో అన్నాను.

చిన్న విషయాల్లో కూడా మెహెర్‌బాబా ఎంత సున్నితంగా ఆలోచిస్తారో చూడండి.

"నేను మిమ్ముల్ని పూణేలోని గురుప్రసాద్‌లో ఒక్కరోజు దర్శనార్థం రమ్మనమని ఆహ్వానం పంపాను.

మరి మీరందరూ రేపు కూడా ఉండటానికి వీలు కుదురుతుందా? అని ప్రశ్నించారు.

అంటే ఉద్యోగాలకు సెలవు, రైలు - రిజర్వేషన్‌లు, ఇతరత్రా ఇబ్బందులు కలగవు కదా అన్నది బాబావారి ఉద్దేశ్యం.

ఇబ్బంది ఏమీ లేదు బాబా, తప్పకుండా ఈ రాత్రికి వుండి రేపటి బాబా పుట్టినరోజు కార్యక్రమానికి అందరం హాజరుకాగలం అని బాబాతో చెప్పాను.

బాబా ఇంకా ఏమన్నారు... నీ విషయంలో సరే!

మిగిలిన నీ స్నేహితుల వీలు గురించి కూడా వాకబు చేయమన్నారు.

నేను తిరిగి నా స్నేహితులందరినీ కల్సి వారి వీలు కనుక్కుని, వారందరినీ కూడా తిరిగి బాబా ఎదుటకు తీసుకెళ్ళి, వారందరికీ ఎలాంటి అసౌకర్యం లేదని చెప్పించాను.

దాంతో మమ్ములందర్నీ ఆ మర్నాడు ఉదయం 8 గంటలకు గురుప్రసాద్‌కు రమ్మనమని అన్నారు. ఠంచన్‌గా 8 గంటలకల్లా గురుప్రసాద్‌కు చేరాం. గురుప్రసాద్ బంగళా మొత్తాన్ని చాలా అందంగా అలంకరించారు.

అంతటా పెద్ద ఊరేగింపు కొనసాగింది. మెత్తని తివాచీలు పరిచారు. బాబా ఆ పరిసర ప్రాంగణమంతా ప్రేమగా, నవ్వుతూ- విచ్చేసిన వారందర్నీ పలుకరించారు. తిరిగి గురుప్రసాద్ హాల్లోకి వచ్చాక సో॥ ఏరుచ్ ప్రార్థనలు- ఆరతి ఇచ్చారు.

కొందరు చక్కని గీతాలు ఆలాపించారు.

బాబా ఎంతో ఆనందంగా వాటిని ఆలకించారు. ఈ కార్యక్రమం చాలా చక్కగా జరిగింది. ఆ రోజున బాబా అందరికీ ఆలింగనం ఇచ్చాను. స్వయంగా చేతినిండా ప్రేమతో ప్రసాదం ఇచ్చారు.

మీ హృదయాల్లో నన్ను నింపుకొని నేరుగా మీ ఇళ్ళకు తిరిగి వెళ్ళండి- అని ప్రేమతో మెహెర్‌బాబా మాకు వీడ్కోలుపలికారు.

# పాలకొండ

మా సెంటర్ బాబా ప్రేమికులు చెరవ సాంబమూర్తి గారు 07.05.2010 శుక్రవారం రాత్రి 11 గంటలకు బాబా నామం చెపుతూ బాబాలో ఐక్యమైనారు.

పాలకొండ, మెహెర్‌బాబా సెంటర్ ఫోన్-9248696632,





# రోజుకొక గంట మౌనము

***- శ్రీమతి బి. హెచ్. సీతాదేవి, విజయవాడ***

బాబా ప్రేమికులందరం ప్రతి సంవత్సరం జూలై 10న మౌనమును పాటిస్తున్నాము. ఇది బాబా ఇచ్చిన ఆజ్ఞయే. బాబా తాను బోధించుటకు రాలేదు. మేల్కొల్పుటకే వచ్చాను అన్నారు.

అంటే మనమందరం ఆత్మ స్వరూపులమే అనే సత్యానుభవము నిచ్చుటకే ఆయన రాక అని మనము గ్రహించాలి.

అయితే ప్రతి సంవత్సరము జూలై 10న అనగా జూలై 9 అర్ధరాత్రి 12 గంటలనుండి జూలై 10 అర్ధ రాత్రి వరకు మనము పాటించే ఈ మౌనము, బాబా ఇస్తానన్న మేల్కొల్పుకు ఏ విధముగ సహాయపడుతుంది, అని మనము విచారణ చేసుకుందాము.

అసలు మౌనము అంటే మనకందరకు తెలిసినది నోటితో మాట్లాడకుండ ఉండడమే అని. బాబా భగవద్వచనములోని "7 మడతల తెర" లో కూడా ఈ నోటి ద్వారా చేసే మౌనమునకు ప్రాధాన్యత ఇచ్చారు. ప్రారంభములో మనము నోటి ద్వారా అక్కరలేని మాటలు మాట్లాడి మన ప్రాణశక్తిని వృథా చేసుకుంటున్నాము, అని గ్రహించి అవసరములేని మాటలు, మాట్లాడకూడని మాటలు ఇతరులను బాధించేమాటలు మాట్లాడకుండుటకు అభ్యాసము చేయాలి.

దీని కొరకు కేవలం జూలై 10న మాత్రమే కాకుండా, ప్రతి రోజు మన అవకాశమును బట్టి ఒక గంట మౌనముగా ఉండుట అభ్యాసము చేసుకుంటే మంచి ఫలితము ఉంటుంది అలాగే మిత భాషిత్వము, మితహారము, సాత్వికహారము కూడా మంచిదే.

దైవము తెలిపినట్లు మౌనము ద్వారానే భగవంతుడు మానవునికి అనుగ్రహం ప్రసాదిస్తాడు. సత్య విషయము ఎప్పుడు మౌనము గానే ఇవ్వబడును, మౌనము గానే స్వీకరించబడును.

నోటితో మాట్లాడకుండుటయే మౌనము కాదు.

మనస్సు సదా ఏదో ఒక ఆలోచనలు చేస్తూ ఉంటుంది.

మనస్సును, మౌన పరచడమే అసలైన మౌనము దానికి నిరంతరము బాబా నామస్మరణ ఉపయోగపడగలదు.

భగవదనుగ్రహం పొందడానికి సత్యానుభవములో మేల్కొనడానికి ఈ మౌనము చాలా సహాయపడగలదు. మనమందరము ఈ జూలై 10న బాబా చెప్పినట్లు మనస్సును కూడ ఇతర ఆలోచనలు లేకుండా మౌన పరచుకొని బాబా వాగ్దానము చేసిన ఆ సత్యానుభవములో మేల్కొల్పమని బాబాను వేడుకుందాము.

## బాబా మన మధ్యనే వున్నారు

**శ్రీ ఎ.ఎస్.ఆచారి,విశాఖ**

మెహెర్‌బాబా మౌనంగానే మన మధ్యన ఉన్నారు. మౌనంగానే మనందరితో మాట్లాడుతున్నారని బాబా ప్రేమికులు శ్రీ ఎ.ఎస్.ఆచారి, విశాఖపట్నం తన అభిప్రాయంగా తెలియజేశారు. వీరు శ్రీ ఎ.వి. రాఘవులు, శ్రీ బిలాస్‌పూర్ రామారావ్, తదితరుల అంతేవాసి. గత అవతారాల కాలంలో చేసిన బోధనలు, సందేశాలు మానవాళి పెడచెవిన పెట్టాయి. అందుకే తాను ఈ అవతార కాలంలో మౌనం పాటించానని మెహెర్ బాబా ప్రకటించారన్నారు. మెహెర్‌బాబా మౌనం చాలా శక్తివంతమైంది. ప్రగాఢమైందీను. బాబా వారి మౌన సంభాషణ ఇంకాకొనసాగుతోంది. ఆయన మాటలు వినాలనుకునేవారు మెహెర్‌బాబా చిత్రపటం ముందు క్షణకాలం నిల్చుంటే తప్పకుండా ఆయన మాటలు మనకు వినపడతాయి. ఏదైనా కష్టం వస్తే, బాబా చిత్రపటం ఎదుట నిల్చుని, మనస్సులోని మాట ఆయనకు చెప్పుకుంటే, ఉరట కలిగించే తగిన సమాధానం బాబా తప్పక ఇస్తారు. నేను ఈ సలహాను బాబా ప్రేమికులు అయిన వారికీ, బాబా ప్రేమికులు కాని వారికీ అందరికీ చెప్తుంటాను. అనేకమంది, అనేకమార్లు నా మాటలతో నూటికి నూరుశాతం అంగీకరించారు. బాబావారి మాటలు తమకు ఎంతగానో ఉపశమనం కల్గించాయని వారు నాతో చెప్పారు. మెహెర్‌బాబా మౌనంగా మనందరితో నిత్యం, అనుక్షణం మాట్లాడుతున్నారు.

## I AM NEVER SILENT

***- Meher Baba***

"If you were to ask me why I do not speak, I would say I am not silent, and that I Speak more eloquently through gestures and the alphabet Board"

"If you were to ask Me why I do not talk, I would say, prehaps for three reasons.

Firstly, I feel that through you all I am talking eternally.

Secondly, to relieve that boredom of talking incessantly through your forms, I keep silence in My personal physical form.

And thirdly, all talk in itself, is idle talk.

Lectures, messages, statements, discourses of any kind, spiritual or otherwise, imparted through utterances or writings are just idle talk when not acted upon or lived upto".

"Things that are Real are given and received in Silence".

"I am never silent. I speak eternally. The voice that is heard deep within the soul is My voice. The voice of inspiration, of intuition, of guidence, through those who are receptive to this voice, I speak".





# నా స్మృతిపథంలో

**-శ్రీ నోరి హనుమంతరావు, కోఠి సెంటర్**

ఆ దినం 1.11.62,

పునా నగరంలో గురుప్రసాద్ భవనం వెనుక ప్రాంగణములో 4 రోజుల పాటు జరిగిన ప్రాక్ పశ్చిమ సమావేశపు మొదటి రోజు.

అప్పుడు నావయస్సు 24.

ఏదో పిక్నిక్‌కి వచ్చానన్న భావనే కానీ శరీరధారి అయిన పరమాత్మను దర్శించుకొనుటకు వచ్చానన్న మానసిక పరిపక్వత నాలో లేదని ఇప్పుడనిపిస్తుంది. బాబా ఎంతో తేజోమయంగా, మరెంతో సౌందర్యంగా వున్నారు. సో. మధుసూదన్ భజన మాధుర్యంతో పరిసరాలు చాలా గంభీరంగా వున్నాయి. ఆ రోజున బ్రహ్మాండమైన వర్షం పడింది. ఆ కారణంగా, దర్శనార్థుల పంక్తి నత్తనడకన నడుస్తోంది. 10,000 లకు పైగా ప్రేమికులు హాజరయ్యారు. మేమయితే ఇంచుమించు ఆఖరి వరుసలో కూర్చున్నాం. "ఈ నత్తనడక క్యూ చూస్తుంటే మనకు దర్శనము ఈ రోజు కాకపోవచ్చు. రేపటి వరకు వేచి వుండాలేమో" అని నా ప్రక్కనే కూర్చున్న మా తమ్ముని చెవిలో గుస గుసలాడుతున్న రీతిలో అన్నాను. నా మాటలు ముందువరుసలో కూర్చున్న వారికి కూడా వినిపించే అవకాశం లేదు. ఆ మరుసటి క్షణంలోనే ఏమయిందో తెలుసాండి. నా మనసులో వచ్చిన ప్రశ్నకు జవాబుగా అన్నట్లు సుమారు ఓ ఫర్లాంగు దూరంలో ఎత్తైన వేదిక మీద సోఫాలో కూర్చున్న బాబా (అప్పటికే రెండు ఘోరమైన కారు ప్రమాదాలవల్ల శరీరము శిథిలమైన కారణంగా) ఇరువైపులా వున్న బాబా ప్రేమికులు సో. ఏరుచ్, సో. భరూచాల సహాయంతో లేచి నిలబడి, తన రెండు చేతులెత్తి **"ఆఖరి వరుసలో కూర్చున్న ప్రతి ఒక్కరికీ దర్శనం ఈ రోజునే జరుగుతుంది. నిరుత్సాహపడవద్దు - అని బాబా తన సౌజ్ఞలను సో. ఏరుచ్ మాటలతో చెప్పించారు. ఆ పిదప దాన్ని అన్ని భాషల్లోకి తర్జుమా చేసి ప్రకటించారు. బాబాకు మనందరి గురించి బాగా తెలుసు. ఆయన ప్రతి చిన్న విషయానికి తగిన రీతిలో ఎప్పటికప్పుడు జవాబిస్తారు.**

ఆనాడు నేను దర్శించుకున్న ఆ దివ్య తేజోమయ దర్శనం, అవతారుని ఆ దివ్య మంగళ సౌందర్యం, లేత గులాబి రంగు వర్చస్సు, నా స్మృతిపథంలో ఓ చెరగని ముద్రగా కలకాలం నిలిచాయి. అవతారుని ఆ అపూర్వ దర్శనం నాకు ఓ మరువలేని శాశ్వత మధురానుభూతి.

# మధురానుభూతి

**- శ్రీ సి.వై.చింతామణి, విజయనగరం**

శబ్దం లేకపోతే ప్రపంచం బోసిపోతుందనుకుంటారు. కానీ అది నిజం కాదు. మెహెర్‌బాబా 44 సంవత్సరాలు కఠిన మౌనంలో వున్నారు.

మానవ కళ్యాణం కోసం తాను మౌనం చేపట్టానని బాబా స్పష్టం చేశారు. మెహెర్‌బాబా 1925 జూలై 10 న మౌనం ప్రారంభించారు.

ఇంతకు ముందు అంటే జూలై 4 న ఓ రోజున తన సమీప భక్త బృందంతో మాట్లాడుతూ, సద్గుర్విణి హజ్రత్ బాబాజాన్ త్వరలో దేహత్యాగం చేయనుంది.

తద్వారా తనకు మరింత కార్యభారం పెరగనుందని అన్నారు.

అందువల్ల తాను మౌనం ప్రారంభించడం తప్పనిసరని ప్రకటించారు.

తాను చేపట్టబోయే మౌనం వల్ల ప్రపంచ శాంతి, సుస్థిరత, విశ్వ కళ్యాణం, సాధ్యమౌతుందని వివరించారు. తాను ప్రారంభించిన ఈ విశ్వ కార్యక్రమంలో పాలుపంచుకునేలా ప్రతి మౌన వార్షికోత్సవం నాడు తన భక్తులూ, ప్రేమికులూ అందరూ మౌనం పాటించమని కోరారు. అలాగే, తాను స్వయంగా ఎంపిక చేసుకున్న తన సమీప మండలి ప్రేమికులైన గుస్తాజీ, శ్రీమతి పిలమాయిలాంటి వారిని తనతో సమానంగా మౌనం పాటించాలని బాబా ఆదేశించారు. ఆ దరిమలా కూడా బాబా తాను ఎంపికచేసుకున్న ప్రేమికులను ఫలానా రోజునుంచి ఫలానా రోజుదాకా మౌనం వుండమని ఆదేశించారు. ఇదంతా బాబావారి విశ్వ కార్యక్రమంలో భాగంగానేనని మెహెర్‌బాబా అన్నారు. కాగా, ప్రతి ఏడాది జూలై 10న తన ప్రేమికులనందరీ వీలయినంత మేర మనస్సుని కట్టడిచేసి తన నామస్మరణలో గడమని ఆదేశించారు.

❋❋❋

మా కుటుంబమంతా 1966 నుండి బాబా మౌన వార్షికోత్సవంలో దాదాపు ప్రతి ఏడాదీ క్రమం తప్పకుండా పాలుపంచుకునే అవకాశం లభించింది.

ఇది అవతారుడు మాకు కల్గించిన భాగ్యంగా మేం భావిస్తాం.

ఒకసారి ఏమైందంటే,

అది 1973 జూలై 10 వ తేది.

ఎప్పటిలా ఇంటిల్లిపాదీ మౌనంగా వున్నాం.

అప్పట్లో మేం శ్రీకాకుళంలో వుండేవాళ్ళం.

కాగా, స్థానిక బాబా ప్రేమికులు శ్రీ యం. సత్యనారాయణ గారింట్లో జూలై 10న





అర్ధరాత్రి 12 గంటలకు మౌనం ముగించేందుకు ముందుగా ఓ మూడు గంటలపాటు రాత్రి 9 నుండి 12 గంటల దాకా బాబా భజనలు, ప్రార్ధన, ఆరతి ఏర్పాటు చేశారు.

మౌనంలో భజనలు ఏమని మీకనిపించవచ్చు.

నిజమే.. మౌనంలో భజనలు.. నోటితో కాకుండా, సంగీత వాయిద్యాలతో... అంటే నేను హార్మోనియంపై, నా భార్య వయోలిన్‌పై, శ్రీ ప్రకాశరావు గారని స్థానిక సెంటర్ బాబా ప్రేమికులు ఆయన తబలాపై, నా కుమారుడు కిరణ్ మరో వాయిద్యంపై ఇలా ఒక్కొక్కరు ఒక్కో సంగీత వాయిద్యంపై నోరు మెదపకుండా బాబా నామం, భజన చేసేలా ఓ ప్రత్యేక అరుదైన కార్యక్రమం రూపొందించారు.

ఈ కార్యక్రమానికి వెళ్ళడానికై రిక్షా పిలిపించుకుని, వాయిద్యాలు అందులో వుంచుకుని బయలుదేరాం.

రిక్షావాలా ఎక్కడికి వెళ్ళాలి, ఎలా వెళ్ళాలి, ఎటువైపుకి తీసుకెళ్ళాలని అడిగినప్పుడల్లా మౌన భంగం కాకుండా సంజ్ఞలతో ఆతనికి దారిని చూపుతూ గమ్యాన్ని చేరాం.

రిక్షా బాడుగ ఇచ్చేలోగా ... అయ్యో, కుటుంబమంతా, అందరూ మూగవాళ్ళేనే.. అని ఓదార్పుగా అంటూ మేం ఇచ్చింది తీసుకున్నాడు.

ఆ తర్వాత రిక్షావాలా కూడా మాతో పాటు బాబా ప్రార్ధనా హాలులోకి వచ్చి, అవతారునికి నమస్కరించి మాతో కూడా వుండి ప్రసాదం తీసుకుని చక్కావెళ్ళాడు.

ఆ రోజు మాకింకా గుర్తుంది.

❋

# చల్లపల్లి

మే 25న చల్లపల్లి బాబా సెంటర్ అధ్యక్షులు శ్రీ వురిమి వెంకట సత్య లక్ష్మీనారాయణ గారు, అలాగే, ఏప్రిల్ 24న బాబా ప్రేమికులు శ్రీ తాడేపల్లి హనుమంతరావు గారు, విజయవాడ బాబాలో ఐక్యమయిన సందర్భంగా, స్థానిక బాబా సెంటర్‌లో సంస్మరణ ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేసి కొన్ని క్షణాలు మౌనం పాటించినామని శ్రీ పి.వి. రమణారావు తెలిపారు.

అలాగే, చల్లపల్లి సెంటర్ వార్షికోత్సవం సందర్భంగా ఏప్రిల్ 23న ప్రత్యేక కార్యక్రమం ఏర్పటు చేసినట్లు, ఇందులో డా॥ ఇ.ఎస్. ప్రభాకర్, వారి భార్య శ్రీమతి దుర్గప్రసాద్, విజయవాడ ప్రత్యేక అతిథులుగా విచ్చేసి బాబా సందేశాలపై ప్రసంగించారని ఆయన తెలిపారు. ❋

## మండలి సభ్యుడు

# విష్ణు నారాయణ్ డియోరూఖర్

**1903 జూన్ 26-1962 మే 13**

శిష్యుడు తయ్యారుగా వుండగానే, ఆ మరుక్షణమే ఆతని గురువు ప్రత్యక్షమవుతాడన్నది నానుడి.

విష్ణునారాయణ్ డియోరూఖర్ క్లుప్తంగా విష్ణుమాస్టర్ విషయంలో అక్షరాలా ఇదే జరిగింది. 15 సంవత్సరాల పిన్న వయస్సులోనే విష్ణు మాస్టర్ బాబా సన్నిధిలోకి సంపూర్ణంగా వచ్చాడు. పూనేలోని కాస్బాపేట సమీపంలో మెహెర్‌బాబా వాళ్ళుండే ఇంటికి కొంచెం ఆవలగానే విష్ణు వాళ్ళుండేవారు. ఆ రోజుల్లో బాబా ఒకచిన్న గదిలో వుంటూ, ఓ దేవాలయంగా ప్రార్థనలు- ఆరతి ఇచ్చి, వచ్చిన వారందరికీ ప్రసాదం పంచేవారు.

ఒకరోజున బాబా ఇలా ప్రసాదం ఇస్తుంటే, ఓ చిన్న పిల్లవాడు కూడా వచ్చి తన రెండు చేతులు ప్రసాదం కోసం ముందుకు చాచి వుంచాడు. బాబా ప్రసాదం పెడుతూ, ఆతని పేరు, తండ్రి ఎవరూ? అని అడిగారు. దాంతో చిన్నపిల్లవాడైన విష్ణు తన తండ్రి చనిపోయాడని, తాను తల్లిదగ్గర వుంటున్నానని తన గురించిన వివరాలు అన్నీ చెప్పాడు. బాబా ఏమన్నారో తెలుసాండి- ఇదిగో- నేటి నుండి నేను నీ తండ్రిని - తెలిసిందా? అన్నారు. ఆ రకంగా ఆతని బాగోగులు బాబా తన మీద వుంచుకున్నారు.

ఓ రోజున విష్ణు తల్లి బాబా దగ్గరికి వచ్చి, అయ్యా నాకొడుకు చెడు స్నేహాలు చేస్తున్నాడు. అతిగా సినిమాలకు వెళుతున్నాడు అని చెప్పింది. దాంతో బాబా కోపంగా - దగ్గర్లోని సినిమా హాలుకు వెళ్ళి, సినిమా చూస్తున్న విష్ణుని చెంపపై చెళ్ళుమనిపించారు. 'నా డబ్బులతో టిక్కెట్టు కొనుక్కుని సినిమాకు వచ్చానని, నన్నెందుకు కొడుతున్నారని బాబాతో విష్ణు అన్నాడు. అయితే సినిమాకు నన్నెడిగి వెళ్ళావా? నా అనుమతి వుందా అని బాబా తిరిగి అతడిని అడిగారు. ఇకపై నీ తండ్రిని నేనేనని నేను నీకు ముందుగానే చెప్పాను కదా! అన్నారు.

అప్పటి నుండీ బాబాకు చెప్పకుండా, ఆయన అనుమతి లేకుండా ఏపని చేయలేదు.

ఆ తర్వాత 1923 ప్రాంతంలో ముంబాయిలోని మంజిల్-ఇ-మీంలో మండలి సభ్యునిగా చేరమని బాబా విష్ణుకు కబురు పంపారు. ఈ సమయంలో విష్ణు మాస్టర్‌కు బజార్‌కెళ్ళి కావల్సిన సామాన్లు తీసుకురావడం, అందుకు తగిన లెక్కలు సరిచూసే పనిని అప్పగించారు. ఈ పనికై ఆతని పేరు 'బజార్‌వాలా' అన్నారు. బాబా ఎక్కడున్న విష్ణుమాస్టర్ ఈ పనిని తన జీవిత చరమాంకం దాకా నిర్వహించాడు.

ఆయన బాబాతో కల్సి 1929లో తొలి విదేశీ పర్యటన చేశాడు. అలాగే, 1932లో





బాబా పర్యటించిన పశ్చిమ దేశ పర్యటనలోనూ విష్ణు మాస్టర్ పాల్గొన్నారు. ఇతర సమయాల్లో- బాబాతో పర్యటనలో లేని సమయంలో, ప్రతినిత్యం, బాబా ఎక్కడ వుంటే అక్కడికి, మెహెరాబాద్ మండలివారి క్షేమ సమాచారాలు టెలిగ్రాంలు పంపడం ఆతనికి బాబా వారిచ్చిన పని. ఏదేనీ ఒకరోజు విష్ణు టెలిగ్రాం పంపక పోతే, ఏం జరిగిందంటూ? బాబానే విష్ణుని సంజాయిషీ కోరుతూ- టెలిగ్రాం పంపేవారు.

శ్రీ విష్ణుమాస్టర్ 1920 నుండే మెహెరాబాద్‌లో వుండి అనేక బాబా వారి కార్యక్రమాలు నిర్వహించాడు. మెహెరాబాద్‌కు విష్ణు మాస్టర్ ఒక ప్రధానమైన మూలస్థంభం అని వర్ణించారు. ఆదీ సీనియర్, పాడ్రీ, పెండూ, విష్ణులను Four pillars of Meherabad అనీ బాబా అభివర్ణించారు. 1949 ఆగస్టులో 'నవజీవనం' గురించి ప్రకటిస్తూ, బాబా ఈ నల్గురిని ఈ మాదిరి సంభోదించారు. బాబాతో నవజీవనంలో పాల్గొన్న 20 మందిలో శ్రీ విష్ణు మాస్టర్‌కూడా ముఖ్యులు. అంతేకాదు, నవజీవనం తర్వాత మెహెర్‌బాబాకు మహారాష్ట్రలోని సతారాలో జరిగిన రెండవ కారు ప్రమాద సమయంలో బాబాతో పాటు వున్న వారిలో విష్ణూజీ కూడా వున్నారు. ఈ ప్రమాదంలో అందరిలోకి అతి తక్కువ గాయాలు తగిలింది విష్ణు మాస్టార్‌కే. అంతేకాదు, ఈ ప్రమాద సమయంలో అవతార్ మెహెర్‌బాబా తన దివ్యదర్శనం తనకు ప్రసాదించారని శ్రీ విష్ణుమాస్టర్- ఏరుచ్‌తో కురుక్షేత్ర సంగ్రామంలో శ్రీకృష్ణుడు అర్జునిడికి ప్రసాదించిన దివ్య దర్శనం మాదిరి బాబా విష్ణు మాస్టర్‌కి తేజోవంతమైన కాంతి పుంజంతో - వెయ్యి సూర్యకాంతి ప్రకాశంతో కనిపించారని, శ్రీ విష్ణు ఏరుచ్‌కు వివరించాడు. 1962 మే 13న బాబా పూనేలోని గురుప్రసాద్‌లో వున్నారు. దర్శన కార్యక్రమం అయిపోయాక అందరూ వెళ్ళిపోయారు. దాదాపు అదే సమయంలో తీవ్ర గుండెపోటుతో శ్రీ విష్ణు తుదిశ్వాస విడిచారు. డా॥ గోహెర్ బాబాకు ఈ విషయాన్ని చెప్పగానే, బాబా వచ్చి సుమారు ఒక గంటకు పైగా శరీరం వదిలేసిన విష్ణు మాస్టర్ ప్రక్కనే వున్నారు. "Never before have I sat near the body of any of my mandali as Iam doing today by vishnu" అని బాబా అన్నారు.

విష్ణు చాలా అదృష్టవంతుడు. నన్ను చేరాడు అని బాబా ప్రకటించారు. మండలివారందరిలోకి పొట్టిగా - కురుచగా వుండే విష్ణు మాస్టర్- విధేయతకు మారు పేరుగా బాబా చెంత వున్నాడు. దిగువ మెహెర్‌బాబాలో పురుష మండలి వారి సమాధులలో బాబా మండలి సభ్యుడు నీలూ- ప్రక్కనే విష్ణు మాస్టర్ సమాధి వుంది!! ఈ దఫా మెహెరాబాద్‌లో వీరి సమాధినీ సందర్శించండి!! నవజీవనంలో బాబాను అంటిపెట్టుకుని త్యాగమయ జీవనం గడిపాడు. నవజీవనంలో మంజలీమాఫీలో వుండగా తల్లి కకుబాయి మరణించింది. అయినా నవజీవన నియమానుసారం ఎలాంటి దుఃఖం ప్రదర్శించక బాబా ఆలింగనం పొందిన ధన్యుడు- విష్ణు.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చురీ, లార్డ్ మెహెర్, వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ

*(గత సంచిక తరువాయి)*

బాబాని ఆ పరిస్థితుల్లో ఎప్పుడూ చూడని మండలివారు గాభరాపడ్డారు. ఏమయిందీవాళ అని కంగారుపడ్డారు. వాళ్లని మరింత బెంబేలు ఎత్తించడానికి అన్నట్లు బాబావారు వో సంజ్ఞ చేశారు. ఆ సంజ్ఞ అర్థం ఏమిటో తెలుసా పాఠక మహాశయా! ఆ అర్థంచెపితే మీరు కూడా గాభరాపడతారు. బాబావారు ఏమన్నారంటే, ఈవేళ నేను చచ్చిపోతున్నానన్నారు. మండలి వారి గుండె పగిలింది. ఏమీ చేయటానికి పాలుపోలేదు. 'బాబా' నిజంగా నా", అని మౌనమూర్తికేసి దీనంగా చూశారు. కళ్ళకి కనబడుతున్న దృశ్యం గుండెని గుభేలుమనిపించింది. బాబావారి కళ్ళు సగం మూతపడుతున్నాయి. కళ్ళలో కాంతి లేదు. చేతులు, పాదాలు ఐసు ముద్దలా మారాయి. శరీరంలో చలనం లేదు. నిర్జీవంగా కనిపిస్తున్నారు బాబా.

బొంబాయి నుంచి శుభ సమాచారం వస్తే, సంతోషంగా వుండాల్సింది పోయి, బాబా వారు ఇలా ఎందుకు మారారో అంతుపట్టలేదు మండలివారికి.

ఇదంతా ఆలీ వల్లేనా? ఆలీ వల్ల అనేకంటే విశ్వకార్యక్రమ ప్రభావంవల్ల అని అంటే సబబు. విశ్వకార్యక్రమానికి మాధ్యమం ఆలీ కావటం వల్ల, ఆ కుర్రాడు తమ దగ్గర వుండాలని బాబావారు అనుకొన్నారు. ఆలీ తమ చెంత వుంటే, విశ్వకార్యక్రమం వల్ల కల్గే అలసట కాస్తంత తగ్గుతుందని భావించారు.

ప్రపంచాన్ని శాసించే విధాతకి వో చిన్న కుర్రాడు మాధ్యమమా? ఆశ్చర్యంగా లేదూ? వూహించ గలరా ఎవరైనా? ఎంత మహత్తరకార్యమో బాబావారు చేపట్టిన పని అందుకనే ఆలీని కంటికి రెప్పలా చూసుకొంటున్నది. వాడి ఆలనా పాలనా చూస్తున్నది. ఈ సంగతి ఎవరికి?

ఎవరి సంగతి ఎలా వున్నా ఆలీ తండ్రికి మాత్రం సుతరామూ తెలియదని 28వ తేదీన మరోసారి స్పష్టమయింది. ఆ వేళ బొంబాయి నుంచి టెలిగ్రామ్ వచ్చింది. ఆలీని మెహెరాబాద్‌కి పంపడానికి అతని తండ్రికి సుతరామూ ఇష్టం లేదుట. వాళ్ళచుట్టాలకీ





ఇష్టం లేదుట. అయ్యో! ఇప్పుడు ఏలాగ అనుకొన్నారు మండలివారు. ఏమీ పాలు పోలేదు వాళ్ళకి. బాబావారిలో మాత్రం ఏమీ కదలిక లేదు సరికదా, సంతోషంగా కన్పించారు. ప్రేమాశ్రమం పిల్లలు వచ్చి, బాబా మిమ్మల్ని కృష్ణుడిగా చూడాలని వుంది. అంటే, "సరే, మీ ఇష్టం", అన్నారు. వాళ్ళు సంతోషంతో ఎగిరి గెంతువేశారు. వెంటనే బాబాని కృష్ణుడిగా ముస్తాబు చేసారు. ఫించం పెట్టారు.

బాబావారు అభ్యంతరం చెప్పలేదు. వేణువు ఇచ్చారు. చిరునవ్వుతో చేతబట్టారు. పూలహారం తెచ్చారు. ఆనందంగా మెడలోవేయించుకొన్నారు. తలపై ఫించం, చేతిలో వేణువు మెడలో పూలహారంతో చూడముచ్చటగా వుంది ఆ దృశ్యం. ధన్యుల మయినామనుకొన్నారు మండలివారు. ద్వాపర యుగంలో భగవానుడు కృష్ణుడు ఇలానే వుండేవారు అనిపించింది. పిల్లలని మనసారా అభినందించారు.

అహమ్మద్‌నగర్ నుంచి జి.ఎమ్.షా వచ్చాడు. అతను బాబావారి ఆస్థాన ఫోటోగ్రాఫరు. రకరకాల భంగిమల్లో బాబాకి ఫోటోలు తీశాడు. పిల్లలతో బాబా ఫోటోలు తీయించుకొన్నారు.

అలా ఆ రోజు, ఆనందంగా గడిచింది. మర్నాడు ఆలీ ఉత్తరం వచ్చింది. "కళ్ళు మూసినా, కళ్ళుతెరిచినా నువ్వే కనిపిస్తున్నావు," అని వ్రాశాడు. నిన్ను విడిచి వుండలేనయ్యా అని తన గోడు చెప్పుకొన్నాడు. నిన్ను చూడలేని నా జన్మ వృధా అనిపిస్తోంది.

అందుకనే భోజనం మానేశాను. నీ నామమే నా వూపిరి ఇప్పుడు అని దీనంగా పలికాడు. తన మనోవేదనని పద్యరూపంలో వ్రాసి పంపాడు. ఈ పద్యాన్ని బాబా వారికి చదివి వినిపించమని మండలి వారిని కోరాడు.

సర్వోన్నత స్వర్గ శిఖరం నీ నివాసం

సత్య మందిరం నీ విశ్రాంతి కేంద్రం.

ప్రపంచాన్ని కాంతివంతం చేస్తుంది నీ దివ్యకాంతి.

అంటూ బాబాని కీర్తించాడు. నీ ప్రేమాగ్ని వేడికి సలసలా మరుగుతున్న నీటి కుండని నేను. నా నరాలు, నా ఎముకలు నుజ్జునుజ్జు అయిపోయినా నా గుండెలోతుల్లో నుంచి బాబా నామమే వినిపిస్తుంది, అంటూ మనస్సులో మాట విన్నవించాడు.

ఆలీ పద్యాన్ని బాబాకి చదివి వినిపించారు. బాబా స్పందించ లేదు. ఎందుకనో, బాబాతో స్పందన లేకపోవటానికి కారణం మర్నాడు తెలిసింది. రావ్ సాహెబ్, బైదుల్ బొంబాయినుంచి వాపసు వచ్చారు. 'ఆఘా ఆలీని తీసుకురావటం మావల్ల కాదు, బాబా' అని తేల్చి చెప్పేశారు. శతవిధాల ప్రయత్నించాము. కానీ అతడి తండ్రిని ఒప్పించటం మావల్ల కాలేదని', వివరించారు.

'ఓహో! అలాగా! అన్నారు. ఐతే ఇంకోసారి బొంబాయి వెళ్ళు అన్నారు బైదుల్‌తో. ఆఘా తండ్రి హాజీ మహమ్మద్‌కి ఇంకోసారి నచ్చచెప్పి చూడు అన్నారు.

బాబా యిలా ఎందుకు చేస్తున్నారని మండలివారు ఆశ్చర్యపడ్డారు. మౌనమూర్తి నిర్ణయాలు, చేతలు ఎప్పుడు అంతుబట్టవు. ఈ కొత్త బైదుల్ రాయబారం కూడా అదే బాపతుది అని సర్ది చెప్పుకొన్నారు.

ఆ రోజుల్లో బాబా వొంటరిగా వున్నారు. బహుశా ఆలీ గురించి ఆలోచిస్తున్నట్లున్నారు. ఎవర్నీ కలవలేదు. స్కూలు విషయాలు మాట్లాడదామని దస్తూరు వస్తే ఆసక్తి చూపలేదు. 'నీకు తోచినట్లు చేయి అన్నారు. బాగా చీకటి పడ్డాక, తొమ్మిదిన్నర ప్రాంతంలో బాబా స్కూలుకి వెళ్ళారు. అక్కడ ఎవరూ లేదు. పిల్లలు స్కూలుకి వచ్చేది పగటిపూటే కదా, నిశ్శబ్దంగా వుంది. చీమ చిటుక్కుమన్నా పెద్దగా వినిపించేట్లు వుందా సమయంలో.

ఆలీ క్లాసులోకి బాబా వెళ్ళారు. అతడి సీటు ప్రక్కనే కూర్చొన్నారు. సుమారు 15 నిముషాలు కూర్చున్నారు అక్కడ. అప్పుడు బాబాకి దగ్గరగా వొక్క రావ్‌సాహెబ్ వున్నారు. ఇదేమి చోద్యం! ఇక్కడ బాబావారు కూర్చున్నా, బాబా మనస్సు శరీరం మరెక్కడోవున్నట్లుగా వుందనిపించింది అతనికి. బాబా కళ్ళలో శూన్యత కన్పించింది కాస్సేపు. ఇదేమిటి బాబా అని రావ్ సాహెబ్ అడగలేదు. బాబా అతని సందేహ నివృత్తిచేయనూ లేదు. బహుశా ఈ ప్రశ్న – జవాబులకి అవకాశం ఇవ్వకూడదనో ఏమో, బాబావారు స్కూలు నుంచి వడివడిగా నడుస్తూ తమ గొయ్యి గదికి వెళ్ళిపోయారు. రావ్ సాహెబ్ తన పడక గది చేరాడు.

తెల్లవారితే మార్చి 3వ తేదీ ఆలీ తిరిగి రావటానికి బాబా పెట్టిన ఏడురోజుల గడువు రేపు ఉదయంతో అయిపోతుంది. ఒకవేళ ఆలీ రాకపోతే ఏమవుతుంది. రావ్‌సాహెబ్‌కి నిద్ర కరువయింది.





భళ్ళున తెల్లవారింది. నిద్రతో కుస్తీపట్టి వోడిపోయిన రావ్‌సాహెబ్ మంచం దిగాడు. దంతధావనం చేస్తూ బయటకి వచ్చాడు. మరికొంచెం సేపటికి ఆలీ ప్రత్యక్షమయ్యాడు. ఎలా వచ్చావు అని అడిగితే ఇంటి నుంచి పారిపోయానన్నాడు. ఈ మాట రావ్ సాహెబ్‌ని ఆశ్చర్యచకితుడిని చేసింది. అప్పుడు ఏడున్నర అవుతోంది.

బిరబిరా కొండ ఎక్కాడు ఆలీ. గొయ్యి గదిని చేరాడు. బాబా దర్శనమిచ్చే కిటికీ ముందు వినమ్రంగా నిలబడ్డాడు. అలా చాలా సేపున్నాడు ఆలీ. బాబా బయటకి రాలేదు. రావ్‌సాహెబ్ ఆలీని తీసుకువెళ్ళి టిఫిన్ తినిపించాడు. టిఫిన్ తింటూనే ఆలీ మళ్ళీ గొయ్యిగదిని చేరాడు. బాబా దర్శనంకోసం ఎదురు చూస్తున్నాడు.

ఎనిమిది అవుతుంటే, బాబా బయటకి వచ్చారు. ఆలీని హత్తుకొన్నారు. ఆనందంతో ఆలీ మనస్సు గెంతులు వేసింది. బాబా ఆలింగనంలో వొదిగిపోయాడు. సుమారు అరగంట సేపు ఆ దివ్యానుభూతిలో మునిగితేలాడు. ప్రేమమూర్తి ఆలీని ముద్దాడారు. పూల దండవేసి సత్కరించారు. శాలువ కప్పి సన్మానించారు. ఆలీతో ఆశ్రమం చుట్టివచ్చారు. పిల్లలు బాబాని మళ్ళీ కృష్ణుడిగా అలంకరించారు. నెమలి ఫించాలతో కిరీటంపెట్టారు. బాబావారు ఆ కిరీటాన్ని హర్షధ్వానాల మధ్య ఆలీ శిరస్సుపై వుంచారు. రాత్రి భోజన సమయంలో ఆలీని తమ ప్రక్కనే కూర్చోబెట్టుకుని గోరు ముద్దలు తినిపించారు. ధన్యుడవయ్యా ఆలీ.. ప్రేమమూర్తి ప్రేమని దోచుకున్న దొడ్డవి నువ్వు.

మర్నాడు, అంటే మార్చి నాల్గవ తేదీన కూడా మెహెరాబాద్‌లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. కానీ మధ్యాహ్నం పరిస్థితి వొక్క సారి మారింది. మూడున్నరకి బాబావారు అకస్మాత్తుగా అస్వస్థులయ్యారు. శరీరం వొంకర్లు పోయింది. ఎలక్ట్రిక్ షాక్ తగిలినట్లు శరీరం ఎగిరి ఎగిరి పడింది.

రాత్రి తొమ్మిదింటికి మళ్ళీ శరీరం ఎగిరి ఎగిరి పడింది. ఒక్కో కుదుపు 45 నిముషాలపాటు వుంది. ఆ శారీరక బాధ మాటలకి అందదు. బాబావారు శరీరం వదిలిపెట్టబోతున్నారా అన్న భావన కలిగింది. చూసే వాళ్ళకి బాబావారికి ఉపశమనం కల్గించాలని మండలివారు ఎంతగానో ప్రయత్నించారు. ఫలితం దక్కలేదు. అయితే ఈ కుదుపులు వాటంతట అవే ఆగాయి. ఎంత అకస్మాత్తుగా వచ్చాయో, అంత అకస్మాత్తుగానూ ఆగిపోయినాయి.

ఆ రాత్రి, అందరూ నిద్రలోకి జారుకొన్నాక, హాజీ మహ్మద్ ప్రత్యక్షమయ్యాడు. నా ఆలీ ఎక్కడ? వాడిని తీసుకు రండి, అంటూ గొడవ పెట్టాడు. రావ్‌సాహెబ్ నచ్చచెప్పాడు ఇతని మాట వింటే కదా! తన పట్టు వదల్లేదు. నా కొడుకుని తీసుకుపోవాల్సిందే అన్నాడు. ఓపిక నశించి రావ్ సాహెబ్ అరిచినంత పని చేశాడు. "తీసుకుపోతే

తీసుకుపోవయ్యా నీ కొడుకుని. వాడిక్కడ వుంటే మాకు వొరిగేది ఏమీ లేదు నీ ఆలీ పేరు చెప్పి మెహెర్‌బాబా ఎంత బాధ పడుతున్నారో నీకేం తెలుసు. మా స్కూలు వాళ్ళు ఎన్ని కష్టాలు పడుతున్నారో నీ బుర్రకెక్కదు. తీసుకు ఫో. నీ కొడుకుని. వాడు ఇక్కడ వుంటే వాడికే మంచిది. అందుకనే వాడిని వుంచమని ప్రాధేయపడ్డాము తప్ప మాకేదో వొరుగుతుందని కాదు." అని రావ్ సాహెబ్ అంటుంటే ఆలీ తండ్రికి షాక్ తగిలింది. 'సరే నీ పిల్లాడిని తీసుకుఫో. నే పడుకోవాలి అంటూ రావ్‌సాహెబ్ లేచి నిలబడగానే, ఆ పెద్ద మనిషికి నిజంగానే బుర్ర తిరిగింది. తప్పు చేసానా అన్న భావన కల్గినట్లుంది. రావ్ సాహెబ్‌ని కూర్చోమన్నాడు. పిల్లాడిని ఇక్కడే వుంచుతానన్నాడు. అలా అని కాగితం వ్రాసి ఇమ్మంటే సరేనన్నాడు. 'మా అబ్బాయి ఆలీని మెహెర్‌బాబా ఆశ్రమం స్కూల్లో మరో ఏడాదిపాటు చదువుకోవటం నాకు సమ్మతమే" అని వ్రాసి, సంతకం పెట్టాడు.

ఆలీ తండ్రి రాక బాబాకి తెలుసు. రావ్ సాహెబ్‌తో అతగాడి వాగ్వాదమూ తెలుసు. అందుకనే తమ గొయ్యిగదిలో పైనే కూర్చొన్నారు. ఆలీ తండ్రి అంగీకార పత్రం పై సంతకం పెట్టాడని తెలిశాక నిద్రకు వెళ్ళారు. అప్పుడు టైమ్ ఐదు అయింది. పక్షుల కిలకిలరావాలు వినిపిస్తున్నాయి.

రాత్రి జరిగిన సంగతులు ఆలీకి తెలియవు. నిద్రలేస్తూనే తండ్రి వచ్చినట్లు విన్నాడు. కాస్త కంగారు పడ్డాడు. భయపడకు. ఇక్కడ వుండటానికి వొప్పుకొని, అంగీకార పత్రంపై సంతకం పెట్టాడని మండలివారు చెప్పారు.

ఆలీ ఆనందంతో గంతులు వేశారు. దిగువ మెహెరాబాద్‌లో బసచేసి తండ్రిని కలిశాడు. కొడుకుని జాగ్రత్తగా వుండమని చెప్పి తండ్రి బొంబాయికి బయలుదేరాడు. ఈ వేళ పిల్లలకి ఆటవిడుపు ఇచ్చారు. స్కూలుకి శలవ ప్రకటించారు. పిల్లల్నీ, మండలివారిని బాబావారు హాపీవాలీకి పిక్నిక్‌కు తీసుకువెళ్ళారు. 'ఈ వేళ సుదినం'. ఇది ఆఘా ఆలీ దినం', అన్నారు. హాపీవాలీలో పిల్లలు సరదాగా ఆడుకొన్నారు. వాళ్ళ ఆనందంలో బాబా పాల్గొన్నారు. విందు భోజనంతో, ఆటపాటలతో సరదాగా గడిచింది. మధ్యాహ్నమంతా మేము ఈ కొండల్లో, లోయల్లో కాసేపు తిరిగి వద్దామనుకొంటున్నాము మీరు మాతో రమ్మనమని పిల్లలు బాబాని అడిగారు. బాబా సరే అన్నారు. చాలా రోజులుగా బాబా ఉపవాసం వుంటున్న సంగతి పాఠకులకి తెలుసు. శరీరం శుష్కించింది. వొంటిలో సత్తువ లేదు. అయినా సరే, పిల్లల కోసం కొండ ఎక్కారు. ఇలా "కొండయాత్ర" రెండుసార్లు చేశారు. రెండో యాత్ర సాయంకాలం జరిగింది. అప్పుడు ఏమయిందీ అంటే, నడుస్తూ నడుస్తూ బాబావారు కుప్పలా కూలిపోయారు.





వూపిరిపీల్చటానికి కూడా కష్టపడుతున్నారా అనిపించింది. మండలివారు భయభ్రాంతులయ్యారు. బాబాని వెంటనే డాక్ బంగళాకి తీసుకువచ్చారు. కాస్సేపట్లో బాబా కోలుకున్నారు. లేచి నిలబడ్డారు. హమ్మయ్య, అని పెద్దలు పిన్నలు వూపిరి తీసుకొన్నారు.

ఇలా ఎందుకు జరిగింది? నిన్న మెహెరాబాద్‌లో ఎగిరి ఎగిరి పడేసిన కుదుపులు ఈ వేళ హాపీవాలీలో కుప్పలా కూలిపోవటం ఎందుకు జరిగింది.

విశ్వకార్యక్రమం వల్ల శరీరానికి కలిగిన అలసటవల్లనే అలా జరిగింది అనాలి. ఆలీ పేరు చెప్పి బాబా ఎంతగా నలిగి పోయారో వారి కొక్కరికే తెలుసు. రాత్రికి అందరూ మెహెరాబాద్‌కి తిరిగి వచ్చారు. మర్నాటినుంచి స్కూలు తెరిచారు.

ఆశ్రమం స్కూలు మళ్ళీ కళ కళలాడుతోంది. పిల్లలు హుషారుగా వున్నారు. చదువుధ్యాసలో పడ్డారు. రోజూ బాబావారిని కలుస్తున్నారు. వారు చెప్పే ఆధ్యాత్మిక రహస్యాలని శ్రద్ధగా వింటున్నారు.

ఏసు ప్రభువును గురించి బాబావారు నాలుగు మాటలు చెప్పారు. ఆ మాటలు వాళ్ళ మనస్సుకి హత్తుకొన్నాయి.

ఏసు ప్రభువు దేముడు కదా. మరి భగవంతుడు స్వర్గంలో వున్నాడని వొకసారి, నాలో నీలో వున్నాడని ఇంకోసారి, దేముడు ప్రతిచోట వున్నాడు, తరచి తరచి చూస్తే కన్పిస్తాడని మరొకసారి అన్నారు. ఇలా ఇన్ని రకాలుగా ఎందుకు చెప్పినట్లు.

ఇదొక ధర్మసందేహం చాలామందికి.

ఈ విషయాన్ని బాబావారు మార్చి ఐదవ తేదీన ప్రస్తావించారు.

జీససు క్రైస్తు తప్పు చెప్పలేదన్నారు. దేముడు స్వర్గంలో వున్నాడని ఏసు అంటే, అతడు భగవంతుడు కాలేడు కానీ, ఏసు ప్రభువు భగవంతుడు. పరిపూర్ణమైన పరిశుద్ధ ఆత్మ అవతార పురుషుడు. ఈ సంగతి నాకు తెలుసు కాబట్టి దేముడు ఏదో స్వర్గంలోనే వున్నాడని ఏసు చెప్పలేదని అంటాను. అయినా దేముడు స్వర్గంలో ఏదో దొంగలాగా ముడుచుకుని కూర్చొన్నాడని అంటే, "పాపం, దేముడు" అనిపిస్తుంది. జాలివేస్తుంది.

ఇది సరే? జీససు ఏమన్నాడంటే, ఆయన మూడు మాటలు చెప్పాడు.

భగవంతుడు నాలో మీలో వున్నాడని అనుంగు శిష్యులకి చెప్పాడు. ఆ దైవానుభూతిని వరంగా ప్రసాదించాడు వాళ్ళకి.

తనను నమ్మి, తన వెంట వస్తున్నవారికి మాత్రం దేముడు ప్రతిచోటా వున్నాడు.

తరచి తరచి చూస్తే కనిపిస్తాడని పేర్కొన్నాడు. వాళ్ళకీ సంగతి సోదాహరణంగా వివరించాడు.

ఇహ తన దర్శనానికి వచ్చిన అశేష జనవాహినికి మాత్రం, భగవంతుడు స్వర్గంలో వున్నాడని చెప్పాడు. రాగ ద్వేషాలకి అతీతులు కండి. వోర్మి ప్రదర్శించండి. అప్పుడే స్వర్గ ధామం చేరుతారు అని హితవు పలికాడు.

ఇలా భగవదనుభూతి గురించి మూడు రకాలుగా ఏసు ప్రభువు చెప్పాడు. ఎందుకిలా చెప్పాడు అంటే, మానసిక పరిపక్వత అందరికీ వొక్కలా వుండదు కదా. ఎవరికి ఎలా చెపితే, మనస్సుకి హత్తుకొని ముందంజ వేయగలుగుతారో అలాగ చెప్పాడు.

కదిలి రండి. సర్వస్వం వదిలి రండి', అని ఏసు ప్రభువు పిలుపునిచ్చాడు. ఈ మాటలు ఏవో మామూలు మాటలు కావు. వాటి వెనుక ఎంతో భావం దాగి వుంది. నేను ఎవరో తెలుసుకోవాలాంటే సర్వస్వం వదిలి రావాలి.

అప్పుడే నా దివ్య రూపాన్ని కనులారా చూస్తారు. దివ్యానుభూతిని పొందుతారు అని చెప్పకనే చెప్తున్నాడు ఏసు ప్రభువు. క్రైస్తవులు అనుసరిస్తున్న బోధనలు, ఏసు ప్రభువు చేసిన అసలుసిసలైన బోధనలు కాదు. ఇది మత గురువుల నిర్వాకం. ప్రభువు ఉవాచకి తమ మాటలని జోడించారు. ఏసు భోదనల్ని తారుమారు చేశారు అని బాబా వారు పేర్కొన్నారు.ఇంగ్లీషు పిల్లల్ని మెహెరాశ్రమ స్కూల్లో చేర్చుకోవాలన్న ఆలోచన చాలా కాలంగా వుంది. రుస్తుంని ఇంగ్లాడు వెళ్ళమన్నారు. మంచి పిల్లల్ని తీసుకురా అన్నారు.

ఇంగ్లాడులో ఎలా మసులుకోవాలి? పిల్లల ఎంపిక ఏ ప్రకారంగా చేయాలి? ఈ జాగ్రత్తలని మార్చి ఏడవ తేదీన రుస్తుంకి వివరించారు. ఆ సాయంత్రం రుస్తుం బొంబాయికి బయలుదేరాడు. అక్కడి నుంచి మూడు రోజుల తర్వాత లండన్ వెళ్ళే ఓడ ఎక్కాడు. ఆ ప్రకారంగా, మెహెర్ ప్రభువు మండలి వ్యక్తి తొలిసారిగా పాశ్చాత్య ప్రపంచంలో అడుగు పెట్టాడు. రుస్తుం యాత్రా ఫలితాలు ఎలా వుంటాయో? ఐతే, ఒక్కటి మాత్రం స్పష్టంగా చెప్పవచ్చు. అది ఏమిటి అంటే, జనవరినాటి వాతావరణం మెహెరాబాద్‌లో మళ్ళీ సాక్షాత్కరించక పోవచ్చు.

ఈ మాటలని బాబావారే స్వయంగా మార్చి 19వ తేదీన చెప్పారు. ఇదొక భగవత్ప్రేమాగ్ని. ఈ నిప్పు రాచుకొన్నాక, దాన్ని ఎవ్వరూ ఆర్పలేరు. కానీ మంటని కాస్తంత ఎగద్రోయాలి. ఒక్కసారి బాగా మంట అందుకొన్నాక, అది ఆరిపోదు సరికదా, మండుతూనే వుంటుంది. సాధకుడి ప్రమేయం అక్కర్లేదు. ప్రేమాగ్ని ఎంతగా భగ భగా మండుతుంది అంటే, ఆవేడిని భరించ లేరు.

**-సశేషం**





గ్రంధావిష్కరణ

# న మే భక్తః ప్రణశ్యతి

శ్రీ మంత్రవాది శ్రీరామమూర్తి న మే భక్తః ప్రణశ్యతిని అవిష్కరించారు

**గ్రంధావిష్కరణ.**

2010 జూన్ 29, శనివారం, కోఠి సెంటర్, హైదరాబాద్.

పుస్తకం ఖరీదు. రూ. 150.

పేజీలు. 324.

**ప్రాప్తి స్థానం.**

శ్రీమతి యం. శారద, ప్లాటు నంబరు -32, గోదావరి గార్డెన్స్,

జే.జే.నగర్ కాలనీ, యాప్రాల్, సికింద్రాబాద్ - 500 087,

ఫోన్. 9959553218.

న మే భక్తః ప్రణశ్యతి గ్రంధాన్ని జూన్ 29న కోఠి సెంటర్‌లో శ్రీ మంత్రవాది శ్రీరామమూర్తి పుస్తకావిష్కరణ చేసి బాబా ప్రేమికలోకానికి లాంఛనంగా అంకితమిచ్చారు.

తొలి ప్రతి కాపీని శ్రీ నోరి హనుమంతరావు గారికి అందజేశారు.

శ్రీ నోరి హనుమంతరావుకు తొలి ప్రతిని అందిస్తున్న శ్రీ మంత్రవాది

అవతార్ మెహెర్‌బాబాకు అంకితమైన 50 మంది బాబా ప్రేమికుల జీవన రేఖా చిత్రాలను సాధ్యమైనంత మేరకు చాలా వివరంగా ఈ పుస్తకంలో వివరించడమైంది.

ఈ జీవన రేఖా చిత్రాలు నేటి యువతకు, రాబోయే రోజుల్లో అవతారుడిని ఆరాధించేవారికి స్ఫూర్తిగా ఉండగలవని పలువురు అభిప్రాయపడ్డారు.

కాగా, పుస్తకం పంపిణీ విషయంగా, పేరెన్నికగన్న ప్రముఖ కొరియర్ సంస్థ ద్వారా ప్రత్యేక రాయితీపై కొరియర్ సర్వీసులో పుస్తకాలను భద్రంగా పంపేందుకు తగిన ఏర్పాటు చేయడమైంది.

ఇందుకోసం పుస్తకం ఒక్కటే అయితే రూ. 15, ప్రతి పది పుస్తకాల ప్యాకెట్టుకు రూ. 70.లకు కొరియర్ చార్జీలకై అదనంగా పంపవల్సిందిగా మనవి.

పోస్టులో విపిపి ద్వారా పంపవలెనని కోరితే ఒక్కింటికి రూ.45 అదనంగా చెల్లించవలసివుంటుంది.

ఈ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ తమ ఇంట ఉంచుకోదగ్గదని, వీలైన మేరకు ప్రతి ఒక్కరూ చదివి తీరాలని పలువురు బాబా ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు.

శ్రీ నోరి మెహెర్‌చంద్, హైకోర్టు అడ్వకేటు గారు రాసి పంపిన వారి అభిప్రాయం ఇలా వుంది.





# నా అభిప్రాయం

**-నోరి మెహెర్‌చంద్, హైకోర్టు అడ్వకేట్, హైదరాబాద్**

సో॥ మల్లాది కృష్ణానంద్ రచించిన "న మే భక్తః ప్రణశ్యతి" అను పుస్తకాన్ని బాబా దయవలన చదవటం తటస్థించింది. ఈ పుస్తకంలో 50 మంది బాబా భక్తుల అనుభవాలు వారు ఏ విధముగా బాబా పరిధిలోకి వచ్చినారో క్లుప్తముగా విశదీకరించబడినది. ఈ 50 మంది యొక్క అనుభవములలో చాలా మంది గురించి ఏ అవతార్ మెహెర్‌బాబా యొక్క ప్రచురణలలోను ప్రచురించబడలేదు. అనగా వారందరు బాబా యొక్క గుప్త ప్రేమికులు. మనలో చాలామందికి బాబా మండలి సభ్యుల చరిత్ర గురించియే తెలియదు. అటువంటప్పుడు ఈ గుప్తప్రేమికులు గురించి తెలియుట చాలా కష్టము. ఈ పుస్తకమున ప్రచురించబడిన 50 మంది అనుభవములలో 10 నుండి 15 మందివరకు అనగా మండలి సభ్యులు ఇతర ప్రముఖ బాబా ప్రేమికుల గురించి కొంత అవగాహన వుండవచ్చు, గాని మిగిలిన వారి గురించి నా దృష్టిలో ఎవరికి అవగాహన వుంటుందని నేను అనుకోను. సోదరులు మల్లాది కృష్ణానంద్ ఈ పుస్తకము ప్రచురణతో బాబా భక్తుల యొక్క అనుభవాలను తెలుసుకోగలిగాము. చిన్న పిల్లలు సైతం అర్థంచేసుకునే విధంగా సులభమైన శైలిలో ఈ గ్రంధాన్ని రచించటంలో సఫలీకృతులయ్యారు. ఇటువంటి అనుభవాలు వెలుగులోకి రాకుండా ఇంకా చాలా బాబా ప్రేమికుల అనుభవాలు గుప్తంగా వున్నాయి. అలాంటి వాటిని కూడా మన సోదరులు బాబా వారి కృప చేత వెలికితీసి ఇటువంటి మహత్తరమైన గ్రంధాలు మరికొన్ని మనతోటి బాబా ప్రేమికుల కొరకు ప్రచురణ చేయగలరని ఆకాంక్షించుచున్నాను. ఆ ప్రయత్నాన్ని మన ప్రియతమ తండ్రి సదవకాశంగా కల్పిస్తారని ఆశిస్తున్నాను. ***సదా బాబా సేవలో ....***

# శ్రీ పారేపల్లి సత్యం ఇక లేరు.

బాలగోపాల భాస్కరరాజు గారి బుర్ర కథ దళంలో సభ్యులైన బాబా ప్రేమికులు శ్రీ పారేపల్లి సత్యం జూన్ 12న మ॥12 గంటలకు బాబా నామం జపిస్తూ బాబాలో ఐక్యమయ్యారు. జూన్ 12న కోఠి సత్సంగ్ కార్యక్రమంలో భాగంగా వారి ఆత్మకు శాంతి కలుగజేయాలని కోరుతూ నివాళిగా బాబా ప్రేమికులందరూ మౌనం పాటించారు. అనంతరం, శ్రీ సత్యం గారు మక్కువతో పాడుకునే రెండు పాటలను సో. గోపి తన సహజ మృధు మధుర గాత్రంతో చక్కగా ఆలాపించి ఆహుతులైన బాబా ప్రేమికుల మనస్సులను తేలికపరిచాడు.

## యంఆర్‌కే శర్మగారి మనుమని మృతి



హైదరాబాద్ సెంటర్ బాబా ప్రేమికులు శ్రీ యం.ఆర్.కె. శర్మ గారి పెద్ద మనుమడు మెహెర్ తేజ (15) మే 15న బాబాలో ఐక్యమయ్యాడు.

అమెరికాలోని మినియాపోలీస్ ప్రాంతంలో వుంటున్న శ్రీ శర్మ గారి పెద్ద కుమారుడు శ్రీ మలకపల్లి కృష్ణ గారి ఏకైక కుమారుడు చి॥ తేజ సైకిల్ త్రొక్కుకుంటూ, ఆక్సిడెంట్‌కు గురై తలకు బలమైన గాయాలు తగిలి స్థానికంగా చికిత్స పొందుతూ శాశ్వతంగా మెహెరుడికి చేరువయ్యాడు.

ఎంతో అందంగా చురుకుగా, అన్నింటా ముందుండే మెహెర్ తేజ హఠాత్మరణం మలకపల్లి వారిని సహజంగానే కలచి వేసింది.

అయితే బాబా దయవల్ల పిల్లవాని తల్లిదండ్రులు ధైర్యంగా వున్నారని వారి కుటుంబసభ్యులు తెలిపారు.

## మిర్యాలగూడాలో మెహెరామాయి వర్ధంతి

మెహెరామాయి వర్ధంతిని నల్గొండ జిల్లా మిర్యాలగూడాలో మే 20న ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సెంటర్ కార్యదర్శి శ్రీ గోపగాని పెదనరసయ్య ఆధ్వర్యంలో చక్కని ప్రేమిక సహవాస్ నిర్వహించారు.

మెహెర్‌బాబాకు అత్యంత సన్నిహిత ప్రేమికురాలు మెహెరామాయి 1989 మే 20న బాబాలో ఐక్యమయ్యారు. మెహెర్‌బాబా తనను ప్రేమించవల్సిన రీతిలో మెహెరా తన ప్రేమికులందరకీ ఆదర్శం అని మెహెర్‌బాబా స్వయంగా పలుమార్లు ప్రకటించారు.

ఈ కార్యక్రమంలో శ్రీ బి.రామక్రిష్ణయ్య, శ్రీ పి.ఎస్.కె.శర్మ, శ్రీ పురుషోత్తమరావు, శ్రీ సీతారామస్వామి తదితరులు ప్రసంగించారు.





# జోగిపేట సెంటర్

జోగిపేట బాబా సెంటర్ 17వ ప్రారంభోత్సవ వార్షికోత్సవం స్థానిక ప్రభుత్వ పాఠశాల అధ్యాపకులు శ్రీ యం. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మే 16న ఘనంగా జరిగింది.

జోగిపేట బాబా సెంటర్ 1989 నుండి శ్రీ వెంకటేశ్వరరావు గారి స్వగృహంలోనే నిర్వహించారు. కాగా ఓ సందర్భంలో బాబా మండలి సభ్యులు శ్రీ అలోబాజీ జోగిపేట సెంటర్‌ను సందర్శించినప్పుడు, మరో నాలుగు సంవత్సరాలలో ఇక్కడ బాబా సెంటర్‌కై సొంత భవాలు కడతావని శ్రీ వెంకటేశ్వరరావుకి అభయమిచ్చారు. ఆ దరిమలా ఆయన నోటిమాట చలువ అన్నట్లు సుమారు నాలుగేళ్ళలో ఆయన చెప్పినట్లే జోగిపేటలో బాబా సెంటర్‌కు సొంత భవనాలను నిర్మించుకోగల్గాం అని శ్రీ వెంకటేశ్వర్లు వివరించారు.

మెదక్ జిల్లాలో జోగిపేట ఓ చిన్న గ్రామం. హైదరాబాద్ నుండి 80 కిలోమీటర్ల దూరంలో, సంగారెడ్డి- నారాయణ ఖేడ్ రాష్ట్ర రహదారిలో ఓ ప్రక్కగా వుంది.

చిన్న ఎత్తైన కొండపైన ప్రశాంత వాతావరణంలో, చుట్టూ పచ్చని చెట్లుతో నిండివున్న ప్రాంగణంలో బాబా సెంటర్ నిర్మించారు. సెంటర్‌లో బాబా సమాధి నమూనాను ఉంచారు.

**జోగిపేట సెంటర్‌కి మరో విశిష్టత కూడా వుంది. 1945 మే 16న మెహెర్‌బాబా ఈ గ్రామం సందర్శించారు. "సఫి సర్మస్ ఖిబ్లా ఖాద్రి" అనే ఉన్నత శ్రేణి మస్తును ఇక్కడ అవతారుడు సంప్రదించారు.**

ఈ విషయం **WAY FARERS BY WILLIAM DÓNKIN** రాసిన గ్రంథంలో పేజీ నం.264లో చాలా స్పష్టంగా పేర్కొన్నారు. ఆ మాదిరిగా ఈ చిన్న కుగ్రామం అవతారుని పాద స్పర్శతో పునీతమైంది. బాబా ప్రేమికులు వీలుచిక్కితే ఈ సెంటర్‌ను తప్పక సందర్శించవల్సింది. కార్యదర్శి శ్రీ వెంకటేశ్వర్లు 9291858381, 9908180098 సంప్రదించగలరు.

సెంటర్ 17వ వార్షికోత్సవం సందర్భంగా మే 16న, చక్కని బాబా ప్రేమిక సహవాస్ ఏర్పాటు చేశారు. శ్రీ రామచందర్- రామాయంపేట కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీ చంద్రస్వామి, శ్రీ పందుగ రమణ (హైదరాబాద్) శ్రీ దత్తు మహారాజ్, శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్‌ల కవ్వాలీలు- ఘజల్సు ఆలాపన చేశారు.

శ్రీ నోరి హనుమంతరావు (హైదరాబాద్) శ్రీ ఎమ్.పన్నగేశ్వరరావు, శ్రీ సీతారామ స్వామి, శ్రీ ఏ. జనార్ధన రావు, శ్రీ సుధాకర్ భార్గవ్ తదితరులు ప్రసంగించారు. ❀

# వివాహాలు

శ్రీ బి. శంకర్, శ్రీమతి బి. మాధవి గార్ల జేష్ఠ పుత్రుడు, చి॥అవినాశ్ వివాహము చి॥ల॥సౌ॥ అర్చనతో, క్రిస్టల్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్, మెహిదిపట్నం, హైదరాబాద్ లో 30.05.2010, ఆదివారం ఉ॥ 10.05 ని॥లకు జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

శ్రీమతి & శ్రీ భరాది శ్రీనివాస్ జేష్ఠ పుత్రిక, చి॥ల॥సౌ॥ మహేశ్వరి వివాహము చి॥ సతీష్‌తో, ఎస్.బి.ఆర్.కె. గార్డెన్స్, బాలాజీనగర్, మెహిదిపట్నం, హైదరాబాద్ లో 26.05.2010, బుధవారం ఉ॥ 9.05 ని॥లకు జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

శ్రీమతి శ్రీకాకుళ సత్యనారాయణ, శ్రీ శ్రీకాకుళ రమాదేవి గార్ల పుత్రుడు, చి॥నవీన్ కుమార్ వివాహము చి॥ల॥సౌ॥ సుప్రియతో, కె.ఎస్.ఆర్.కళ్యాణ మండపం, దేవుని కడప రోడ్, కడపలో 30.05.2010, ఆదివారం ఉ॥ 09.00 ని॥లకు జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

శ్రీమతి చాగంటి మంజుల, శ్రీ చాగంటి విజయ భాస్కర్ గార్ల పుత్రుడు, చి॥మెహెర్ కార్తిక్ వివాహము చి॥ల॥సౌ॥ మెహెర్ మనోగ్నతో, వైస్రాయ్ గార్డెన్స్, జింఖానా రోడ్, సికింద్రాబాద్‌లో 02.06.2010, బుధవారం ఉ॥ 09.08 ని॥లకు జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

శ్రీమతి ఏలూరి కమల, శ్రీ ఏలూరి రవీందర్‌నాథ్ గార్ల పుత్రిక, చి॥ల॥సౌ॥ సంధ్య వివాహము చి॥ భీమా శంకర్‌లో, శ్రీ కామధేను ఇండస్ట్రీస్ (రైస్‌మిల్) యన్.హెచ్.7, నిజామాబాద్ రోడ్, రామాయంపేట్‌లో 04.06.2010, శుక్రవారం ఉ॥ 11.45 ని॥లకు జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

శ్రీమతి పరికిబండ్ల శ్రీదేవి, శ్రీ పరికిబండ్ల యాదగిరిస్వామి గార్ల పుత్రిక, చి॥ల॥సౌ॥ మెహెర్ మనోగ్న వివాహము చి॥మెహెర్ కార్తిక్ తో, వైస్రాయ్ గార్డెన్స్, జింఖానా రోడ్, సికింద్రాబాద్‌లో 02.06.2010, బుధవారం ఉ॥ 09.08 ని॥లకు జరుపుతున్నట్లు ఆహ్వానం పంపారు.

# వధువు కావలెను

తెలగ/కాపు (బాబా ప్రేమికులు) చెందిన ఏకైక కుమారునకు అదే కులము పేద కుటుంబమునకు చెందిన అందమైన, తెల్లని, పొడవైన వధువు కావలెను. పై అర్హతలున్న ఇతర కులము (బాబా ప్రేమికులు ) కూడా అభ్యంతరం లేదు మాకు. సంప్రదించగలరు. మెహెర్ శ్రీనివాస్, శ్రీకాకుళం. ఫోన్-97032-58218.





# విశాఖ మెహెర్‌నిలయం 40వ వార్షికోత్సం

విశాఖ సెంటర్ 40వ వార్షికోత్సవం ఘనంగా జరుపుకున్నట్లు శ్రీ హరిమెహెర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాది జిల్లాలలోని బాబా ప్రేమికులు సుమారు 300 మంది ఈ కార్యక్రమానికి హాజరయ్యారని ఆయన అన్నారు. ముఖ్య అతిథులుగా శ్రీ సీతారాం, ఎ.జి.ఎమ్., భారతీయ స్టేట్‌బ్యాంకు, శ్రీ ఎం.ఎస్. అప్పారావు, హిందూస్థాన్ షిప్‌యార్డు పాల్గొన్నారు. కాగా శ్రీ టి.ఎన్.రథో, శ్రీ ఎస్.వి.సత్యనారాయణ, ఉషాదేవి, శ్రీ వెంకట్రావు, సిహెచ్. విజయలక్ష్మి, శ్రీ ఎల్.వి.ఆర్.మూర్తి, బాబా సందేశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో బేబీ సమీర చేసిన నృత్యం, బాబా ప్రేమికుడు విలియం డాంకిన్స్ పాత్రధారిగా చి॥ మెహెర్ తేజ అభినయం బాబా ప్రేమికులందర్నీ అలరించాయి.

# హిందూపురంలో

హిందూపురంలో ఏకనామం విజయవంతంగా ముగిసిందని శ్రీ శివ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సుమారు 15 సెంటర్లనుండి బాబా ప్రేమికులు విచ్చేసారని ఆయన తెలిపారు. హిందూపురవాసులకు ఈ ఏకాహం ఒక మరువరాని మధురానుభూతిని కల్గించిందని శ్రీ శివ ప్రసాద్ పేర్కొన్నారు.

# నర్సరావుపేట సెంటర్

అవతార్ మెహెర్‌బాబా నర్సరావుపేట సెంటర్ యొక్క సర్వసభ్య సమావేశము 16.05.2010న మెహెర్ సెంటర్‌లో జరుగగా ఈ క్రింది కార్యవర్గము ఏకగ్రీవముగా ఎన్నుకొబడినది.

**అధ్యక్షులు-** శ్రీ వంకాయల అచ్యుతరావు, **ఉపాధ్యక్షులు-** శ్రీమతి చీమకుర్తి కన్యాకుమారి, **కార్యదర్శి-** శ్రీ నాగసరపు మెహెర్ విజయకృష్ణ, **సహాయ కార్యదర్శి -** శ్రీ వంకాయల హరగోపాల్, **కోశాధికారి** - శ్రీ రాఘవరపు వెంకట కోటేశ్వరరావు, **కార్యవర్గ సభ్యులు-** శ్రీ కాకుమాను వెంకట నరసింహారావు, శ్రీ ఆకురాతి వీరాస్వామి, శ్రీ కోట కోటేశ్వరరావు, శ్రీమతి చోడవరపు సముద్రవేణి, శ్రీ వంకా హనిమిరెడ్డి, శ్రీమతి కోట రంగమ్మ.

స్థానిక మెహెర్‌బాబా సెంటర్‌లో ప్రతి గురువారం, ఆదివారము, పౌర్ణమి రోజున సాయంకాలము 6.30 నుండి 8.30 వరకు భజన, నామ, సంకీర్తనా కార్యక్రమములు జరుగును.

# మెహెరాబాద్

మెహెరాబాద్‌లో బాబా సమాధి చుట్టుప్రక్కల చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణకు మెహెర్‌బాబా ట్రస్టు, అహ్మద్‌నగర్ **సముచిత అధికార సంస్థ – Appropriate Authority** అనే ఒక అరుదైన అధికారిక ప్రకటన మహారాష్ట్ర ప్రభుత్వం 2010 ఫిబ్రవరి 24న చేసింది.

ట్రస్టువారు గత కొన్నేళ్ళుగా మెహెరాబాద్ ప్రాంతంలో చేపట్టిన అనేక అభివృద్ధి పనులకు ఇదొక సముచిత గుర్తింపుగా భావించాలి. ప్రముఖ యాత్రాస్థలాలకు పేరెన్నిక గన్న మనదేశంలో ఇలాంటి అరుదైన గుర్తింపు మెహెరాబాద్‌కు లభించడం పలువుర్ని ఆశ్చర్యపరచడం సహజం. మనకు తెలిసిన అనేక యాత్రస్థలాలు ఇష్టారాజ్యంగా ఒక దిశా నిర్దేశం లేకుండా అభివృద్ధి చెందిన సంగతి పాఠకులకు తెలుసు. యాత్రాస్థలాలు కూడా ఒక ప్రణాళికా బద్దంగా పవిత్రంగా, శుచిగా వుండాలని స్థానిక ప్రజలతో పాటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆలోచిస్తున్నాయనడానికి మహారాష్ట్ర ప్రభుత్వం అధికారిక ప్రకటన నిరూపిస్తుందని, బాబా ట్రస్టు ప్రచురిస్తున్న IN HIS SERVICE జూన్ 2010 న్యూస్ లెటర్ సంచికలో పేర్కొన్నారు.

Appropriate Authority గా గుర్తింపు లభించడం ద్వారా, బాబా ట్రస్టు మరో 175 ఎకరాల భూమి కొనుగోలు చేసే వీలు కలుగుతుంది. ప్రధానంగా బాబా సమాధి, మెహెర్ రిట్రీట్‌ల నడుమ అనేక మొక్కలు, చెట్లు నాటి హరిత వనంగా మలచాలని ట్రస్టువారి ప్రధాన ఆశయం. లక్ష్యమూను. ఆ తదుపరి అమరతిథి రోజుల్లో వచ్చిన అశేష జనవాహిని వాహనాలకు తగిన పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలని, ప్రేమికుల సౌకర్యార్థం మంచి రోడ్లు నిర్మాణం కల్పించాలన్నది ట్రస్టు వారి ప్రధాన ఆశయాలుగా ఈ సంచికలో పేర్కొన్నారు.

బాబా ట్రస్టు 1970 నుండీ, మెహెర్‌బాబా సమాధి చుట్టుప్రక్కల భూమి కొనుగోలుకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చింది. ఇదెలా జరిగిందంటే, బాబా సమాధి చుట్టు ప్రక్కలంతా అనూహ్యంగా అభివృద్ధి చెందుతుందని మెహెర్‌బాబా 1950వ దశకం నుండీ తన ప్రేమికులను హెచ్చరించారు.

ఓ పెద్ద టౌన్‌షిప్ అభివృద్ధి చెందుతుందనీ బాబా ప్రకటించారు. మరో సందర్భంలో మెహెర్‌బాబా సమాధి ప్రాంగణం, మెహెరాబాద్ ఓ పెద్ద పుణ్యతీర్థమౌతుందని మెహెర్‌బాబా 1950లలో ప్రకటించారు. 1969 జనవరి 31న బాబా తన భౌతిక దేహత్యాగం చేశారు. ఆనాడు మెహెరాబాద్‌లో ట్రస్టు వారి ఆధీనంలో చాలా కొద్ది





ఎకరాలు మాత్రం ఉండింది. 1970లో భావూజీ ట్రస్టు ఛైర్మన్ అయ్యాక, మెహెర్‌బాబా హెచ్చరికలను గుర్తుంచుకుని నాటి నుండీ క్రమేణా– అంచెలంచెలుగా సుమారు 300 ఎకరాల మేరకు భూమి కొనుగోలు చేశారు. ఇదేమీ చిన్న విషయం కాదు. ఇది ట్రస్టు వారి దూరదృష్టికి నిదర్శనం. 1998లో బాబా ట్రస్టు మెహెరాబాద్‌లోని బాబా సమాధిని కేంద్రంగా పెట్టుకుని ఒక బృహత్తర మాస్టర్ ప్లాన్‌ను రూపొందించింది. ట్రస్టు వారి మాస్టర్ ప్లాన్‌లోని అనేక అంశాలను, ప్రతిపాదనలను అహ్మద్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ 2005లో చాలా భాగం యథాతథంగా ఆమోదించిందని ఇన్ హిజ్ సర్వీస్ సంచికలో స్పష్టంగా తెలిపారు. .

# మంచి వర్షాలు

గత సంవత్సరం అంటే 2009 వర్షాకాలంలో సగటున 29.4 వర్షం మెహెరాబాద్‌లో నమోదయింది. దీనివల్ల ఈ సంవత్సరం ఏప్రిల్–మే నెలలో కూడా బావుల్లో నీరు ఇంకిపోలేదు. ఈ ఏడాది వర్షాకాలంలో మరిన్ని వానలు కురవాలని అవతారుడ్ని ప్రార్థించుదాం!!

# ఆ అవసరమే లేదు.!!

మహారాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు భారీ పోలీసు రక్షణ మెహెరాబాద్‌లో ఏర్పాటు చేశారని IN HIS SERVICE జూన్ 2010 సంచికలో ప్రచురించారు. వాస్తవంలో అలాంటి ఏర్పాట్లు ప్రస్తుతానికి ఏమీ లేవని, అలాంటి అవసరం కూడా బహుశా భవిష్యత్తులో కూడా రాబోదని స్థానిక బాబా ప్రేమికులు తెలిపారు.

# మెహెర్‌దర్బార్ ప్రారంభం

**శ్రీకాకుళం సెంటర్‌లో జూన్ 20న**

శ్రీకాకుళం మెహెర్‌బాబా సెంటర్‌లో 35x65 అడుగులతో నిర్మించిన విశాలమైన మెహెర్‌దర్బర్‌ను శ్రీ కె.హెచ్.కె.ప్రసాద్, హైదరాబాద్ 20.06.2010 ఆదివారం ప్రారంభించనున్నారని ఆహ్వానం పంపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రేమిక సహవాస్‌లో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి శ్రీధర్మాన ప్రసాదరావు, ఛైర్‌పర్సన్, శ్రీకాకుళం మునిసిపాలిటీ శ్రీమతి యం.వి.పద్మావతి, బాబా ప్రేమికులు శ్రీ బి.రామక్రిష్ణయ్య, శ్రీ యస్.వి. సత్యనారాయణ, శ్రీ ఎస్.వి.మెహెర్‌ప్రసాద్ రాజు తదితరులు పాల్గొంటున్నారు.

(గత సంచిక తరువాయి)

# బాటసారులు

1938 డిసెంబరులో బాబా అన్నిరకాలవారు కలిసిన ఒక శిష్యబృందంతో మోటారులో పర్యటనకు బయలుదేరిరి. మొట్టమొదట వారు హైదరాబాద్ వెళ్ళి అక్కడనుంచి ఈశాన్యంగా జబల్‌పూరు వెళ్ళేరు. అక్కడకొద్ది వారాలుండి కాశి వెళ్ళి అక్కడనుంచి గాంగేయమైదానములమీదనున్న చక్కని మార్గముగుండా మథుర, ఆగ్రా ఢిల్లీ వెళ్లేరు. ఢిల్లీ నుండి పశ్చిమంగా మళ్ళి రాజపుతానా ఎడారులలో నించి ఫిబ్రవరి 1939లో అజ్మీరు చేరుకున్నారు. అజ్మీరు ఆరావళీ పర్వత ప్రాంతాలలో ఉండి ఎండదెబ్బ తిని దుమ్మురేగే నగరం. ఇది వాణిజ్యానికి పేరు పొందినది కాక పోయినా, ఆ యుగపురుషుడైన ఖ్వాజా మోయినుద్దీన్ ఛిష్తీ దర్గా వలన ప్రసిద్ధి పడసిన పట్టణము. ఆకాలంలో అతడు మకుటుం లేని మహారాజు. అతని ఆధ్యాత్మిక శక్తి వలన చాలమంది ఇండియాలో ఇస్లామ్‌మతం పుచ్చుకున్నారు. బలవంతంగా మహమ్మదీయులుగా మారినవారి కన్నా వీరే చాలా ఎక్కువ ఉండుట చేత అజ్మీర్ ఒక ఆధ్యాత్మిక కేంద్రం అయి అది ఒక యాత్రా స్థలంగా వుండినది.

తెల్లటి గోడలు గలిగిన ఒక చిన్న డాబా బాబాకు బస కొరకు అద్దెకు తీసికొనబడినది. ఈ యిల్లు ఒక వడ్డి వ్యాపారస్తునిది. ఇండియాలో అసంఖ్యాకములయిన ప్రయివేటు బ్యాంకర్లు (వడ్డీవ్యాపారస్తులు) ఉన్నారు. బ్యాంకరు అనగానే సాధారణంగా ఓ మోస్తరుగా ధనిక వర్గానికి చెందిన వారి కంటె ఎక్కువవాడు కాదు. ఈ సంగతి పాశ్చాత్యులు తెలుసుకోవాలి. ఎందుకంటే బ్యాంకరంటే పెద్ద లక్షాధికారనుకునేరు. ఈ యిల్లు పెద్దభవనం కాదు. అది పరిశుభ్రంగా చల్లగా ఉండే ఒక మామూలు భవంతి. బాబాకు ఆయనతో దిగిన శిష్యులకు ఉండటానికి చాలదనే చెప్పాలి.

అందరూ ఈ ఇంటిలో సర్దుకోగానే అనేకమంది శిష్యులు మస్తులను కనుగొని బాబా వద్దకు తీసికొనివచ్చుటకు అజ్మీరు సందుగొందులలోనికి పంపబడిరి. ఏడవ భూమికలోనుండి భగవంతునిలో లీనమయిన మజ్జూబ్, అమూల్యమైన పెన్నిది అయిన చాచా నిరుపమానమైనవాడు. ఈతని చరిత్ర ఆది నుండియు యింకొక అధ్యాయములో చెప్పబడినది. గావున మరల చర్విత‌చరణము అనవసరము.

మిగిలిన అనేకమంది మస్తులు బాబా వద్దకు గొనిరాబడిన వారిలో అపూర్వమైన ప్రాశస్త్యముకలవారు ఇద్దరు. లఖన్‌షా మరియు కబరిస్తాన్‌వాలా. లఖన్‌షా ఆరవ భూమికకు చెందిన మజ్జుబ్‌వంటి మస్తు. ముఖ్యంగా అతని లక్షణములు జమాలి





మస్తువంటివే గాని జలాలినిపోలిన గుణములుకూడా కొన్ని ఆతనిలోవున్నవి. బాబా అతనిని మూడు పాళ్ళు జమాలి, ఒక్క పాలు జలాలి అని టూకీగా వర్ణించేవారు. ఎప్పుడో 1922 సంవత్సరంలో బాబా అజ్మీరు వచ్చినప్పుడు బజారులో ఒక పొడుగాటి వ్యక్తిని చూపించేరు. ఆది అతనే లకన్‌షా అని నమ్ముచున్నాడు. 1939లో బాబా మొదటి సారిగా అతనిని ఖ్వాజాసాహెబ్ దర్గా సమీపమునందు తన శిష్యరాండ్రకు చూపెట్టెను. అతడు చినిగిపోయిన దుస్తులతో మురికిగా నుండెను. కాని అతనిని మొదటిసారిగా చూచినవారు రెప్పవాల్చకుండా బాబాకేసి చూచుచున్న అతని కాంతివంతమైన వదనముగాంచి అచ్చెరువు పొందిరి. ఇది జరిగిన కొద్ది సేపట్లోనే కాకా అతనిని బాబా యింటికి తీసికొని వచ్చెను. అతడు కోలముఖము కలిగి బక్కపలచగా ఉండే పొడుగుపాటి మనిషి. అతని కనులు ఆకర్షణీయముగా నుండెను. అతనికి గానము చాలా యిష్టము. అతడు మధురమైన గాత్రముతో హృదయములను కదలించునట్లు పాడునపుడు వినినవారందరు ఉత్తేజితు లగుచుండిరి.

లఖన్‌షా రాగానే బాబా అతనికి క్షౌరముచేసి. స్నానముచేయించి. భోజనము పెట్టేను. ఆ మొదటిరాత్రి బాబా పరున్నగదిలోనే అతడు పండుకొని నిద్రపోయెను. ఆ గదిలో కాకా కూడా వుండెను. లఖన్‌షాగాని అక్కడ నేవున్న కబరిస్తాన్‌వాలాగాని చీకటిలో జారిపోతారేమో జాగ్రత్తగా చూస్తూండమని బాబా కాకాను నియోగించిరి. అరేబియాలోని ఇబిన్ సాదే వలె నిద్రపోతూ చీమచిటుక్కుమంటే మెలకువ వచ్చి లేవగలిగే కాకా ఒక రాత్రి ఎవరోలేచి నెమ్మదిగా తలుపు గడియతీస్తున్న చప్పుడు విని వెంటనే లేచి టార్చిలైటు వేసి చూడగా లఖన్‌షా గదిలోనుండి బయటకు వెళ్ళడం చూసి భయాన్వితుడయ్యెను.

చల్లని ఆ వెన్నెల రాత్రిలో కాకా లఖన్‌షా వెనుకనే వెళ్ళి యెక్కడికి వెళ్ళుచున్నావని అడిగెను. అశుదుల కాతడు లఘుశంకకని చెప్పగానే కాకా పరాజితుడయినవానివలె కలవరపడ్డాడు. బయటకు వెళ్ళి వచ్చిన తరవాత లోపలికి అయిష్టంగానే వచ్చి కాకాతో "కాకా నీవు చాలా గట్టివాడవయ్యా!" అన్నాడు. దీనినిబట్టి లఖన్‌షా మెల్లగా అక్కడనుంచి వెళ్ళిపోదామని యెత్తువేసినట్లు కనిపిస్తుంది. బాబా వైపుకు ఆకర్షణ సగంవతు, అక్కడనుంచి పారిపోదామనే వృత్తి సగంవంతు. భగవదున్మత్తుడుగు మస్తుకి గురువుకి మధ్యనున్న సంబంధం యీ విధంగా వుంటూ వుండడం మామూలయింది.

తరవాత లఖన్‌షాకు కావలసినవన్నీ బాబా స్వయంగా చూచుకొనుచుండెను. ఒక పర్యాయము బాబా అతని పాదములు వత్తుచుండగా 'గురూ! ఆ పని చేయవద్దు' అనెను. ఎవరో అతనిని నీవు యెక్కడకు వచ్చావు అని అడుగగా "గురువు వద్దకు వచ్చా" అని జవాబిచ్చెను.

# జీవిత సభ్యత్వం

## 2010 మే - జూన్ నెలలో పంపిన వారి వివరాలు

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | జూన్ 10 | శ్రీ ముప్పాళ్ళ వెంకటేశ్వర రావు, హైదరాబాద్ | రు. 1000.00 |
| 2. | జూన్ 10 | అవతార్ మెహెర్‌బాబా మల్కిపురం సెంటర్, తూ.గో.జి | రు. 1000.00 |
| | | **మొత్తం** | **రు. 2,000.00** |

## యాకూత్ గంజ్ సెంటర్ 5వ వార్షికోత్సవం

**(యాకూత్ గంజ్ నుంచి శ్రీ పి.యస్.కె. శర్మ, హైదరాబాద్)**

రెండు వారాలపాటు ఉత్తర భారతంలోని బాబా సెంటర్లు ముఖ్యంగా కాన్పూరు, హమీర్‌పూర్, మహేవా సెంటర్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సహవాస్ కార్యక్రమాల్లో పాల్గొనడానికై హైదరాబాద్ నుండి 24 మంది బాబా ప్రేమికులు హైదరాబాద్ నుండి జూన్ 7న బయలుదేరి ముందుగా కాన్పూరుకు సమీపంలోని యాకూత్ గంజ్ సెంటర్‌ను సందర్శించారు. యాకూత్ గంజ్ సెంటర్ 5 వ వార్షికోత్సవం సందర్భంగా మూడురోజుల పాటు జూన్ 10,11,12 తేదీలలో ప్రేమిక సహవాస్‌ను ఘనంగా నిర్వహించారు. శ్రీ శ్రీవాత్సవ, లక్నో, కార్యక్రమాన్ని నిర్వహించారు. బాబావారి భజనలు శ్రీ పండుగ రమణ పార్టీ, హమీర్‌పూర్, ఉరాయ్, ఫతేనగర్, సాగర్ బాబా సెంటర్‌ల ప్రేమికులు చక్కగా గానం చేశారు. శ్రీ బి. రామక్రిష్ణయ్య, శ్రీ శాలిగ్రాం శర్మ తదితరులు ప్రసంగించారు. మామిడి తోటల నడుమ చక్కని బాబా సెంటర్‌ను నిర్మించారు. బాబా చిన్ముద్ర పాల రాతి విగ్రహాన్నిక్కడ ఏర్పాటు చేశారు. 1500 మంది హాజరుకాగల పెద్ద ఆడిటోరియం, మరో పెద్ద ఓపెన్ ఆడిటోరియంలు నిర్మించారు. మెహెర్‌బాబా ఈ ప్రాంతాన్ని 1942 ఫిబ్రవరి లో మస్తుల అన్వేషణలో భాగంగా సందర్శించారని స్థానిక బాబా ప్రేమికులు తెలిపారు. - మరింత సమాచారం తదుపరి సంచికలో...

## తెట్టెకుంట సెంటర్ 8వ వార్షికోత్సవం

అపర మెహెరాబాద్, తెట్టెకుంట సెంటర్ 8వ వార్షికోత్సవం 2010 జూన్ 26 ఉ. 8 గంటల నుండి 2 గంటల వరకు ఏర్పాటుచేసినట్లు చైర్మన్ శ్రీ దుగ్యాల ప్రభాకర్ (9396931448) ఓ ప్రకటనలో తెలిపారు.





## సేవాధర్మం శ్రీకాకుళం సెంటర్

మండుటెండాకాలంలో బాటసారులకు కావల్సింది గ్లాసుడు మంచినీళ్ళే కదా!! శ్రీకాకుళం మెహెర్‌బాబా సెంటర్‌వారు ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది ఏప్రిల్ 28 నుండి జూన్ 10 దాకా నగర నడిబొడ్డున చలివేంద్రం ఏర్పాటు చేసి, ఎందరికో దాహార్తిని తీర్చారు. అంతేకాకుండా ప్రతిరోజూ పది లీటర్లు పాలతో మజ్జిగ కూడా సరఫరా చేసినట్లు సెంటర్ కార్యదర్శి శ్రీపి.వి. రంగప్రసాద్ తెలిపారు.

మే 4 నుండి శ్రీకాకుళం పట్టణంలో నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌లో మెహెర్‌బాబా స్టాలు ఏర్పాటు చేసి మెహెర్‌బాబాకు సంబందించిన సాహిత్యం, చిత్రపటాలు బాబావారి ప్రార్థనాపుస్తకాలు సందర్శకులకు అందజేస్తున్నామని శ్రీ రంగప్రసాద్ పేర్కొన్నారు. ప్రతి రోజూ నూరు మందికి పైగా బాబా స్టాలు సందర్శిస్తున్నారని, ప్రేమప్రసాదాలు అందుకుంటున్నారని ఆయన తెలిపారు.

## గోదావరిఖనిలో

గోదావరి ఖనిలో 9.5.2010 ఆదివారంనాడు సా॥ 7 నుండి 9 గంటల వరకూ శ్రీకట్ట రవీందర్ గారింట్లో మెహెర్‌బాబా భజన కార్యక్రమాలు ఏర్పాటు చేయడమైనది. బాబా భక్తులు గాన, భజనలతో కార్యక్రమం చక్కగా ముగిసినది.

**- వి. రామ్మోహనరావు, అధ్యక్షులు**

## శ్రీమతి కొండపల్లి నిర్యాణం

శ్రీ కొండపల్లి వెంకటాచారిగారి భార్య శ్రీమతి కళావతి (70) 20.05.2010 శుక్రవారం రాత్రి 11 ప్రాంతంలో తీవ్ర గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. బాలగోపాల భాస్కరరాజుగారి బుర్రకథ బృందంలో ఒకనిగా శ్రీ కొండపల్లి బాబా ప్రేమికులందరికీ పరిచయమే.

## సంస్మరణం

శ్రీ చిలుకురి సత్యన్నారాయణ గారి ప్రధమ వర్ధంతి జూన్9న కాకినాడలో జరుపుతున్నట్లు వారి సోదరులు- ఇతర బంధువులు ఒక ప్రకటనలో తెలిపారు. బాబా ప్రేమికులు శ్రీమతి చిలుకూరి సత్యవతి గారి జేష్ఠపుత్రుడు శ్రీ సత్యనారాయణ 2009 జూన్ 9న కాకినాడలో స్వల్ప అస్వస్థతతో బాబాలో ఐక్యమయ్యారు.